RNI TELTEL 2024/90138

# సూర్య

జాతీయ తెలుగు దినపత్రిక

తెలుగు




హైదరాబాద్ । మేడ్చల్ । రంగారెడ్డి । మహబబాద్ । కరీంనగర్ । అదిలాబాద్ । మెదక్ । వరంగల్ । ఖమ్మం । నిజామాబాద్ । నల్లగొండ । భద్రాద్రి కొత్తగూడెం

ప్రధాన సంపాదకులు : కురిమీళ్ల చంద్రశేఖర్ గౌడ్

శుక్రవారం 12- జూన్ - 2026 | సంపుటి : 05 | సంచిక : 0 83 | పేజీలు : 8 | వెల - 5 /

CIRCULATED IN HYDERABAD | MEDCHAL MALKAJGIRI | RANGAREDDY |KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | YADADRI BHUVANAGIRI | NALGONDA | NIZAMABAD | WARANGAL | MAHABUBABAD | MEDAK | ADILABAD | RANGAREDDY

CHIEF EDITOR: KURIMILLA CHANDRA SHEKAR GOUD

Friday 12- 06 - 2026 | VALLUM - 05 | ISSUE 0 83 | PAGES - 8 | RS 5 /

## దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది



- విద్య,వైద్యంతోనే వికసిత్ భారత్-2047 లక్ష్యం సాధ్యం
- వెనకబాటు నిర్మూలనకే యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణం
- సామాజిక వెనకబాటుకు విద్యలేమి కారణంగా తేలింది
- తెలంగాణ అభివృద్ధి నమూనాపై ప్రత్యేకంగా ప్రస్తావన
- నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్ ప్రసంగం
- తెలంణాకు ఐఐఎం అసవరాన్ని గుర్తించాలని వినతి
- ప్రధాని మోడీతో ప్రత్యేక భేటీలో పలు ప్రాజెక్టులపై చర్చ

దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని సూచించారు.

## ప్రత్యేక ప్రణాళికతో గోదావరి పుష్కరాలు



### భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
### రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

రాబోయే 2027 గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే గోదావరి తీర ప్రాంతాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేశామన్నారు. పుష్కరాలకు ఆర్టీసి ప్రత్యేక బస్సులు నడుపుతుందన్నారు.

# కాంగ్రెస్‌లో తృణమూల్ విలీనం అవుతోందా?



### క్లారిటీ ఇచ్చిన హస్తం పార్టీ

- టీఎంసీ విలీన ప్రచారాన్ని ఖండించిన కాంగ్రెస్
- అవన్నీ వదంతులేనన్న కేసీ వేణుగోపాల్
- జాతీయ అంశాలపైనే చర్చించామని వెల్లడి
- మమత, రాహుల్‌తో మమత భేటీతో ఊహాగానాలు
- విలీనంపై ఇప్పటి వరకు స్పందించని టీఎంసీ

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కాంగ్రెస్‌లో విలీనం కానుందన్న ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. అలాంటి చర్చలు ఎక్కడా జరగలేదని స్పష్టం చేసింది. ఈ వార్తలన్నీ పూర్తిగా నిరాధారమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కొట్టిపారేశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

## కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు..



### 'టీఆర్ఎస్'పై ముప్పేట దాడి

- కవిత కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'కు పేరు చిక్కులు
- 'టీఆర్ఎస్' పేరు తమదేనంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన బీఆర్ఎస్
- మహారాష్ట్రకు చెందిన ఓ పార్టీ కూడా అదే పేరు కోసం దరఖాస్తు
- కవిత పార్టీ పేరుపై ఈసీకి వందలాది ప్రజా అభ్యంతరాలు
- వివరణ ఇచ్చేందుకు ఎన్నికల సంఘాన్ని కలవనున్న కవిత ప్రతినిధులు

కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)కు ఆరంభంలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి.

## హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్..

### రూ.5000 కోట్ల స్కామ్‌కు చెక్!



- రూ. 5000 కోట్ల భారీ మోసానికి పోలీసులు అడ్డుకట్ట
- 'ఇగ్నైట్' పేరుతో కొత్త స్కామ్‌కు తెరలేపిన క్యూనెట్ నిర్వాహకులు
- ఆపరేషన్ ఇగ్నైట్ క్రాక్‌డౌన్‌తో ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- సంస్థ ఏర్పడిన 18 రోజుల్లోనే చర్యలు తీసుకున్న హైదరాబాద్ సీసీఎస్

## ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణ
### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. గురువారం జలసౌధలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రి సమీక్ష నిర్వహించారు.సీతమ్మసాగర్ సహా అన్ని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తామని వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ఖమ్మం భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అని మంత్రి తెలిపారు. పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు సాగునీరు, పాత ఆయకట్టుకు స్థిరీకరణ చేస్తామన్నారు. మున్నేరు - పాలేరు అనుసంధానం.. ఖమ్మం, సూర్యాపేట రైతులకు వరమన్నారు. విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటిని మళ్లించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత



## కోల్‌కతాలో భారీ అగ్నిప్రమాదం

### 4వేల ఇవిఎంల దగ్ధంతో అనుమానాలు

పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఉన్న ఒక ప్రభుత్వ భవనంలో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో సుమారు 4,000 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు, అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఇది విధ్వంసక చర్య కావొచ్చని బెంగాల్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి చంద్రిమ భట్టాచార్య అనుమానం వ్యక్తం చేశారు కోల్‌కతాలోని అలీపూర్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రభుత్వ భవనంలో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనంలో ఉంచిన వేలాది ఈవీఎంలు కాలిపోయాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది దాదాపు 24 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈవీఎంలను ఉంచిన ప్రాంతంలోనే మంటలు తీవ్రంగా వ్యాపించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అగ్నిప్రమాదంలో దాదాపు 4 వేల ఈవీఎంలు కాలిపోయాయి ఈ ఈవీఎంలను ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో పది నియోజకవర్గాల్లో ఉపయోగించారు. ఇది సాధారణ అగ్ని ప్రమాదంలా కనిపించడం లేదు. ఏదైనా కుట్ర జరిగిందా అనే అంశాన్ని దర్యాప్తు చేస్తున్నాం. ఫోరెన్సిక్ నివేదిక అనంతరం పూర్తి స్పష్టత వస్తుంది' అని బెంగాల్ మంత్రి కౌశిక్ చౌధురీ తెలిపారు.

## సీఎంగా బాధ్యతల తర్వాత తొలిసారి..
## ప్రధాని మోదీతో డీకే శివకుమార్ భేటీ



- రాష్ట్రాభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని విజ్ఞప్తి
- బెంగళూరు మెట్రో, రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాలపై ప్రధానంగా చర్చ
- గత ప్రభుత్వ వైఖరికి భిన్నంగా నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న శివకుమార్

## రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు
# శాశ్వత భవనాలు

- తొలి దశలో 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు కొత్త భవనాలు
- నిర్మిస్తున్నట్లు పొంగులేటి వెల్లడి
- దీని ద్వారా శిథిలావస్థలో ఉన్న భవనాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వెల్లడి
- భవనాల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపును వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం



## ఆర్ అండ్ బీలో రోడ్స్ ఈఎన్సీ ఎవరు..?



### మోహన్ నాయక్ ఏసీబీకి దొరికిపోవడంతో పోస్టులు ఖాళీ
### ఐఆర్‌సీకి కొత్త సారథి నియామకం.!

రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖలో స్టేట్ రోడ్స్ ఇంజినీర్ ఇన్ చీఫ్ పోస్టులో ఉన్న మోహన్ నాయక్ ఏసీబీకి దొరికిపోవడంతో పోస్టు ఖాళీ అయింది. రోడ్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ (ఆర్‌డీసీ)కు ఎండీగా కూడా నాయక్ వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ 2 పోస్టుల్లోకి ఎవరు రానున్నారనేది చర్చనీయాంశంగా మారింది. సదరు అధికారిపై సస్పెన్షన్ ఆర్డర్ ఇంకా రాలేదని, అదే సమయంలో కొత్త బాధ్యతలు కూడా

## హామీలు నెరవేర్చలేక కేంద్రంపై నిందలా

### కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ డికె అరుణ

రాష్ట్ర ప్రభుత్వం పనులు చేయలేక కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ పార్టీ నేతలను బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు.



సూర్య
జాతీయ తెలుగు దినపత్రిక
శుక్రవారం 12 - 06 -2026

# కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు..

పార్టీ పేరు చుట్టూ తీవ్ర వివాదం నెలకొనడంతో, ఈ అంశం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 'టీఆర్ఎస్' అనే పేరును ఇతరులకు కేటాయించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) పలు వైపుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తాయి.ఈ వివాదంలో ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'టీఆర్ఎస్' అనే పేరు 14 ఏళ్ల తెలంగాణ ఉద్యమ చరిత్రతో, ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ తమ పార్టీని ప్రజలు 'టీఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని, కాబట్టి ఆ పేరును వేరొకరికి కేటాయించవద్దని కోరుతూ ఈసీకి అధికారికంగా ఫిర్యాదు చేసింది.మరోవైపు, కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన 'తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' అనే సంస్థ కూడా 'టీఆర్ఎస్' అనే పేరు కోసం ఈసీకి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు దరఖాస్తు చేసినట్లు తెలియవచ్చింది.ఇవి మాత్రమే కాకుండా, కవిత పత్రికల్లో ఇచ్చిన ప్రకటన ఆధారంగా సుమారు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు ఈసీకి అందినట్లు సమాచారం. అదే సమయంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే 'తెలంగాణ రాజ్య సమితి' పేరుతో నమోదైన మరో పార్టీ కూడా 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామాన్ని వాడటంపై అభ్యంతరం తెలుపుతూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఈ పరిణామాల నేపథ్యంలో, తమ వాదనలు వినిపించేందుకు కవిత ప్రతినిధుల బృందం త్వరలో ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధమవుతోంది. ఒకే పేరుపై ఇన్ని వైపుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న తరుణంలో కవిత తన కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరును దక్కించుకుంటారా లేదా అన్నది ఇప్పుడు తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

## సీఎంగా బాధ్యతల తర్వాత తొలిసారి.. ప్రధాని మోదీతో డీకే శివకుమార్ భేటీ

కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం డీకే శివకుమార్ తొలిసారిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. గురువారం ఢిల్లీలో ఈ భేటీ జరిగింది. కర్ణాటక రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన ప్రధానిని కోరారు.జూన్ 3న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శివకుమార్, తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వం నీతి ఆయోగ్ సమావేశాలను బహిష్కరించగా, అందుకు భిన్నంగా శివకుమార్ ఈ సమావేశానికి హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రంతో సమన్వయంతో పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనే సంకేతాలను ఆయన ఈ సందర్భంగా ఇచ్చారు.ప్రధానితో భేటీకి ముందు శివకుమార్ కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎలివేటెడ్ కారిడార్లు, పెరిఫెరల్ రింగ్ రోడ్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలని కోరారు. బెంగళూరు మెట్రో ఫేజ్-2 సవరించిన అంచనాలకు, అలాగే ఫేజ్-3 ప్రాజెక్టుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు బెంగళూరు నుంచి మైసూరు, తుమకూరు, కోలార్ నగరాలను అనుసంధానిస్తూ రీజినల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటుపై కూడా చర్చించారు. ప్రధాని మోదీతో జరిపిన చర్చలు అత్యంత ఫలప్రదంగా, నిర్మాణాత్మకంగా సాగాయని శివకుమార్ వెల్లడించారు. రాష్ట్ర సంక్షేమం, ప్రగతి కోసం కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉంటుందని గతంలో ప్రధాని ఇచ్చిన హామీని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు:

రాష్ట్రంలోని అన్ని ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటిశ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈరోజు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తొలి దశలో భాగంగా 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఒకే నమూనాలో కొత్త భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల సమస్యకు దీని ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు తుది డిజైన్లను ఖరారు చేస్తామని తెలిపారు. భవన నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.మరోవైపు, ఓఆర్ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని విమర్శించిన మంత్రి, తాము కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలనను బలోపేతం చేశామని వివరించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## హామీలు నెరవేర్చలేక కేంద్రంపై నిందలా

గురువారం మక్తల్‌లో ఎంపీ డీకే అరుణ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. నూతన గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రహదార్లు, అంగన్వాడీ కేంద్రాలు, భవనాలు, బాలింతలకు, గర్భిణీలకు కేంద్ర ప్రభుత్వమే పౌష్టిక ఆహారం అందిస్తుందన్నారు. ఈ రెండున్నర ఏళ్లలో ఏ ఒక్క పెండింగ్ పనులు చేయలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ప్రాంతాల మధ్య విద్వేషాలు, సెంటిమెంట్‌తో మాయమాటలు చెప్పి అధికారంలో వచ్చాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు మరొక్కసారి గారడి మాటలతో అబద్ధం చెప్పి అధికారంలో వచ్చాడని మండిపడ్డారు. రెండు తులాల బంగారం, మహిళలకు రూ.2 వేల పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదంటూ అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చేసిన అభివృద్ధి ఏమిటని ఆ పార్టీ నేతలను ఈ సందర్భంగా నిలదీశారు. రేవంత్ రెడ్డి సర్కార్ చేసిన అప్పు ఎంతో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కొడంగల్‌లో రోడ్లు వేస్తే సరిపోదని.. రాష్ట్రమంతా వేయాలన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఇంటి జాగా లేని వారికి స్థలం ఇచ్చి ఇల్లు ఇస్తామన్న హామీ ఏమైందంటూ కాంగ్రెస్ పార్టీ నేతలను బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. దేశంలో అధిక కాలం ప్రధాన మంత్రి పదవి చేపట్టి ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు సృష్టించారన్నారు. దేశాన్ని అన్ని రకాలుగా బీజేపీ అభివృద్ధి చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అందుకే దేశ ప్రజలు మూడోసారి బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టారని డీకే అరుణ చెప్పారు.

## ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత

భద్రాచలం, ఖమ్మం వరద రక్షణ పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని.. ప్రతి ప్రాజెక్టుకు గడువులు నిర్దేశించి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



## హర్యానాలో బిష్ణోయ్ గ్యాంగ్ దాడి జిమ్ యాజమానిపై కాల్పులు.. అక్కడిక్కడే మృతి చెందిన ట్రైనర్ కపిల్

హర్యానాలోని హన్సి ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున ఒక ఘోరమైన హత్యాకాండ చోటుచేసుకుంది. ఫవ్వారా చౌక్ సమీపంలో తెల్లవారుజామున సుమారు 5:30 గంటల సమయంలో, కపిల్ అనే రెడ్ జిమ్ యజమాని యువతీ యువకులకు వ్యాయామ శిక్షణ ఇస్తుండగా ఈ దాడి జరిగింది. హెల్మెట్లు ధరించి మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు, కపిల్‌ను లక్ష్యంగా చేసుకుని అతి సమీపం నుండి దాదాపు 10 రౌండ్ల కాల్పులు జరిపారు. దుండగులు అతని తల, వీపు భాగాలను గురిచేసి కాల్చడంతో కపిల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఆకస్మిక కాల్పుల సమయంలో అక్కడ వ్యాయామం చేస్తున్న శిఖ అనే మహిళకు కూడా బుల్లెట్ గుర్తులు తగలడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం హిసార్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, ఫోరెన్సిక్ బృందాలు రంగంలోకి దిగి సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తును ముమ్మరం చేశాయి. హత్య జరిగిన కొద్దిసేపటికే, గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు చెందిన హరి బాక్సర్ అనే సభ్యుడు ఒక ఆడియో సందేశాన్ని విడుదల చేస్తూ ఈ హత్యకు తామే బాధ్యులమని ప్రకటించాడు. తనతో పాటు ఆర్‌డి ధలివాల్, హర్మాన్ సంధు, విక్రమ్ కాధల్ కలిసి ఈ దాడికి వ్యూహం రచించినట్లు పేర్కొన్నాడు. గతంలో షేక్‌పురా ధరిక్‌పురియాలో జరిగిన కాల్పుల ఘటనలో కపిల్ తమ ప్రత్యర్థులకు కుట్రపూరితంగా సహకరించాడని, అందుకే అతడిని అంతమొందించామని ఆడియోలో తెలిపాడు. ఈ విషయమై గతంలో తమ అనుచరుడు సుందర్ హన్సి ద్వారా కపిల్‌ను రెండుసార్లు హెచ్చరించినప్పటికీ అతను వినలేదని పేర్కొన్నాడు. అంతేకాకుండా.. ఇటీవల ఢిల్లీలో జరిగిన కాల్పుల ఘటనకు కూడా తమ గ్యాంగే కారణమని, బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు సన్నిహితంగా ఉంటున్న సదరు వ్యక్తికి ఎంత భద్రత ఉన్నా వదిలిపెట్టబోమని ఆ ఆడియోలో తీవ్ర హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. ప్రస్తుతం విదేశాల్లో తలదాచుకుంటూ ఈ తరహా దాడులకు పాల్పడుతున్న బిష్ణోయ్ గ్యాంగ్ కదలికలు పోలీసు వ్యవస్థకు పెద్ద సవాల్‌గా మారాయి.

## ఏటా 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది సిఎం రేవంత్‌కు బిఆర్ఎస్ నేతల సూటి ప్రశ్న

రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో అన్ని అబద్ధాలతో కాలం గడిపారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ విమర్శించారు. గడిచిన రెండేళ్లలో ఉద్యోగ నియమకాలపై ముఖ్యమంత్రికి సవాలు విసిరారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డి సుధీర్ రెడ్డి, మాదవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ రాజుతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో ప్రతి ఏటా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులందరూ నిరుద్యోగులకు హామీ ఇచ్చారని, నేటికి కేవలం 12 వేల 600 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే ఇచ్చిన నోటిఫికేషన్లను మాత్రమే భర్తీ చేశారని ఆరోపించారు. 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు రుజువు చేస్తే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేస్తామని, దమ్ముంటే మీరు రాజీనామా చేయాలని ముఖ్యమంత్రికి డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నగరానికి దూరంగా ఫార్మాసిటీ కోసం స్థలాన్ని ఎంపిక చేశారని ఆరోపించారు. కేసీఆర్ ఆనవాళ్లు కనిపించకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫార్మాసిటీ స్థలంలో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి పూనుకున్నారని వెల్లడించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ రూం , కేబుల్ బ్రిడ్జితో పాటు అనేక నిర్మాణ పనులను కేసీఆర్ చేపట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క కొత్త నిర్మాణ పనులు చేపట్టలేదని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన చేపట్టిందని కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ప్రజలు నివశిస్తున్న ప్రాంతంలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు, శానిటేషన్ తదితర అభివృద్ధి చేపట్టాలని, జనాలు లేని చోట పనులు చేయడం సరైనది కాదని సూచించారు.

## ఈ రాత్రికే భీకర దాడులు తప్పవు మరోమారు ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. 'ఈరోజు రాత్రి ఇరాన్‌పై చాలా తీవ్రంగా దాడి చేస్తాం' అని తన సోషల్ మీడియా 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. ట్రంప్ ప్రకటన పశ్చిమాసియా దేశాలలో ఉద్రిక్తతలను మరింత పెంచింది. కేవలం సైనిక చర్యలకే పరిమితం కాకుండా, ఇరాన్‌కు అత్యంత కీలకమైన చమురు, సహజవాయు మౌలిక వసతులపై కూడా నియంత్రణ సాధించే దిశగా అడుగులు వేయనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌కు ప్రధాన చమురు ఎగుమతి కేంద్రంగా ఉన్న ఖర్గ్ ద్వీపం సహా పలు చమురు మౌలిక వసతులను నియంత్రణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. గతంలో వెనెజువెలాపై అనుసరించిన వ్యూహంతోనే ఇరాన్‌ను నియంత్రణలోకి తీసుకుంటామన్నారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేన, రాడార్, క్షిపణి నిరోధక వ్యవస్థలతో పాటు రక్షణ రంగానికి చెందిన అన్ని వ్యవస్థలు ఇప్పటికే నాశనమయ్యాయి. సమీప భవిష్యత్తులో ఖర్గ్ ద్వీపాన్ని, ఇతర చమురు కేంద్రాలను స్వాధీనం చేసుకుని ఆయా మార్కెట్లపై నియంత్రణ సాధిస్తాం. వెనెజువెలాలో చేసిన మాదిరిగానే ఇరాన్‌లో కూడా మా ప్రణాళిక ఉంటుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

## అప్పులతో కాలక్షేపం చేసిన కెసిఆర్ మంత్రి వివేక్ ఘాటు విమర్శలు

కేసీఆర్ హయాంలో ఇష్టమొచ్చినట్లుగా అప్పులు చేశారని మంత్రి వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శిలాఫలకాలు వేయడమే తప్ప.. నిధులు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. గురువారం అక్బర్‌పేట భూంపల్లి మండలం నగరం రామలింగేశ్వర ఫంక్షన్ హాల్లో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడారు. కాంగ్రెస్‌ది పేదల ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. సిద్దిపేటకు పదివేల ఇళ్లు ఇచ్చామని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్లు 50 శాతం వరకు స్లాబ్ లెవల్‌కు వచ్చాయని మంత్రి వివేక్ వెంకటస్వామి వివరించారు. ఎవరైనా ఇళ్లు లేని వారు కట్టుకుంటామని చెబితే.. ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని స్పష్టం చేశారు. 200 యూనిట్ల కరెంట్ ఫ్రీగా ఇస్తున్నామని వెల్లడించారు. రూ.300 కోట్లు తెలంగాణ ఆర్టీసీకి కేటాయించామని వివరించారు. సిద్దిపేట జిల్లాకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. అర్హులైన వారికి కొత్త పింఛన్లు ఇస్తున్నామని అన్నారు. స్కూల్ పిల్లలకు ఫ్రీ బ్రేక్‌ఫాస్ట్, ఇంటర్‌మీడియట్ విద్యార్థులకి మధ్యాహ్న భోజనం ఫ్రీగా అందజేస్తున్నామని అన్నారు. రెండు రోజుల్లో ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని కలెక్టర్ అన్నారని చెప్పారు. రాష్ట్రంలో సరిపోయినంత యూరియా ఉందని.. కొరతలేదని చెప్పుకొచ్చారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా రైతన్నలకు ఇస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి

## ఇడి కోర్టుకు రాజ్ కసిరెడ్డి లిక్కర్ స్కాంతో రూ.195 కోట్ల నష్టం

ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఏపీ బేవరెజస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసు దేవా రెడ్డి, రాజ్‌కసి రెడ్డిలని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన అనంతరం ఈడి కోర్టులో హాజరు పరిచారు. అయితే, ఈకేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏపీ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, వాసుదేవరెడ్డి తన అధికారిక హోదాను ఉపయోగించి అధిక ధరలకు ముందస్తుగా నిర్ణయించిన సంస్థలకు మద్యం రవాణా టెండర్లు కట్టబెట్టారని ఈడీ అధికారులు గుర్తించారు. ఈ స్కాంలో రాజ్ కసిరెడ్డి, వాసుదేవా రెడ్డికి బంధువులకు చెందిన రూ.441.63 కోట్ల ఆస్తులను ఈడీ ఇప్పటికే అటాచ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకి సంబంధించిన హైదరాబాద్ నివాసంలో ఈడీ అధికారులు గురువారం సోదాలు జరిపారు. తనిఖీల అనంతరం కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.195 కోట్ల మద్యం రవాణా కుంభకోణానికి పాల్పడి, మనీలాండరింగ్‌కి ఆయన పాల్పడినట్లు గుర్తించారు.

## దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

తెలంగాణ కులసర్వేలో భూమి, డబ్బు కంటే విద్యే సామాజిక వెనుకబాటుకు కారణమని తేలిందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం ఢిల్లీలో జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. నీతి ఆయోగ్ వేదికగా కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ డబ్బు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కులసర్వే వివరాలను ప్రస్తావించారు. దేశంలో ఏ రాష్ట్ర సీఎం, అధికారులైనా వచ్చి తెలంగాణలో తాము కడుతున్న 'యంగ్ ఇండియా స్కూల్స్' చూడాలని సూచించారు. సంతోషంగా తాము దగ్గరుండి చూపిస్తామని పేర్కొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజిన్లుగా ఉన్న టాప్-6 నగరాల కోసం రూ.6 లక్షల కోట్లతో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని పీఎంవోకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధే.. విద్య, ఆరోగ్యమే దానికి బలమైన పునాది అని వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని సూచించారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించేందుకే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. స్కిల్స్ యూనివర్సిటీ నిర్వహణలో ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు భాగస్వామ్యంగా ఉన్నాయని వెల్లడించారు. టాటా గ్రూప్ సహకారంతో రూ.2,100 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలోని ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా మారుస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'తెలంగాణ రైజింగ్' విజన్- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్లు.. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. హైదరాబాద్‌కు ఐఐఎం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. తెలంగాణకు అంతర్జాతీయ వర్సిటీలు.. హైదరాబాద్‌లో 'యూనివర్సిటీ ఆఫ్ లండన్' ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని చెప్పుకొచ్చారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధికి 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ 6 ప్రధాన నగరాల మౌలిక వసతుల కోసం ఒక్కో నగరానికి రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేంద్రం ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రోడ్, మెట్రోఫేజ్-2, మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీకి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని సూచించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే సమావేశానంతరం సిఎం ప్రధాని మోడీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణకు సంబంధించి వివిధ ప్రాజెక్టుల అనుమతులపై చర్చించారు. మూసీ రివర్ ఫ్రంట్, ట్రిపుల్ ఆర్, మెట్రో రెండో దశ తదితర ప్రాజెక్టులపై చర్చించారు.

## ప్రత్యేక ప్రణాళికతో గోదావరి పుష్కరాలు

నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్‌లైన్స్ రోడ్డు ఉన్న హుస్నాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని.. డ్రైనేజీ సిస్టమ్ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. గురువారం హుస్నాబాద్ బస్టాండ్‌ని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడి బస్సుల వివరాలు, మౌలిక సదుపాయాలు గురించి అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. పెరుగుతున్న పట్టణానికి అనుగుణంగా ఇంజినీరింగ్ కాలేజీ, టూరిజం, మెడికల్ కాలేజీ ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ప్రయాణికుల సంఖ్య.. బస్టాండ్ రెవెన్యూ పరంగా ముందుందని తెలిపారు. ప్రతిరోజూ 35 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వెళ్తుంటారని చెప్పుకొచ్చారు. హుస్నాబాద్ బస్టాండ్‌ని పెద్ద షాపింగ్ మాల్‌గా అభివృద్ధి చేస్తామని.. మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్.. రూ.5000 కోట్ల స్కామ్‌కు చెక్!

హైదరాబాద్ పోలీసులు సుమారు రూ. 5,000 కోట్ల భారీ ఆర్థిక మోసాన్ని సకాలంలో గుర్తించి అడ్డుకున్నారు. 'ఇగ్నైట్' పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న మనీ సర్క్యులేషన్ నెట్‌వర్క్‌ను ఛేదించి, నలుగురు కీలక నిందితులను అరెస్టు చేశారు. అమాయక ప్రజల నుంచి భారీగా నగదు వసూలు చేసేందుకు సిద్ధమైన ఈ ముఠా కుట్రను సీసీఎస్ పోలీసులు ముందే పసిగట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియాకు వెల్లడించారు. ఈ వ్యవహారంలో హైదరాబాద్ పోలీసులు 'ఆపరేషన్ ఇగ్నైట్ క్రాక్‌డౌన్' పేరిట ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేరళ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. సదరు సంస్థ భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన కేవలం 18 రోజుల్లోనే పోలీసులు రంగంలోకి దిగి, పెను నష్టం జరగకుండా నివారించడం విశేషం. గతంలో నిషేధానికి గురైన క్యూనెట్, విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ నెట్‌వర్క్‌ల నిర్వాహకులే 'ఇగ్నైట్' పేరిట ఈ సరికొత్త మోసానికి తెరలేపినట్లు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) దర్యాప్తులో వెల్లడైంది. గత మూడు దశాబ్దాలుగా ఈ ముఠా వరుసగా గోల్డ్ క్వెస్ట్, క్వెస్ట్‌నెట్, క్యూనెట్, తాజాగా ఇగ్నైట్ రూపంలో వివిధ పేర్లతో ప్రజలను వంచిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు బాధితులు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భారీస్థాయిలో ప్రజలు ఆర్థికంగా నష్టపోకముందే ఇలాంటి మనీ సర్క్యులేషన్ రాకెట్లను గుర్తించి, వాటిని నిర్మూలించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీపీ సజ్జనార్ వివరించారు.

## కాంగ్రెస్‌లో తృణమూల్ విలీనం అవుతోందా?

ఈ భేటీ తర్వాతే రెండు పార్టీల విలీనంపై ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఆ సమావేశంలో జాతీయ రాజకీయ అంశాలపై మాత్రమే చర్చ జరిగిందని వేణుగోపాల్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా సమస్యలను మరింత సమర్థంగా ఎలా లేవనెత్తాలనే అంశంపైనే చర్చ జరిగిందన్నారు. విలీన ప్రతిపాదన గానీ, అలాంటి చర్చలు గానీ అస్సలు జరగలేదని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల టీఎంసీ తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల్లో అసమ్మతి పెరిగిందన్న వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్‌తో టీఎంసీ విలీనం కావచ్చున్న ప్రచారం ఊపందుకుంది. ఇదే అంశంపై టీఎంసీ ఎంపీ సౌగత రాయ్ కూడా స్పందించారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం అవసరమని చెప్పారు. అయితే అది కూటమి రూపంలో ఉంటుందా, విలీనం రూపంలో ఉంటుందా అనేది ఇప్పుడే చెప్పలేమన్నారు. మరోవైపు విలీనంపై టీఎంసీ అధిష్ఠానం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

## ఆర్ అండ్ బీలో రోడ్స్ ఈఎన్సీ ఎవరు.?

ఎవరికీ ఇవ్వలేదని శాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఆర్ అండ్ బీ రీ-ఆర్గనైజేషన్‌లో మంజూరైన దాని ప్రకారం స్టేట్ రోడ్స్ విభాగానికి చీఫ్ ఇంజినీర్ పోస్టు మాత్రమే ఉంది. మోహన్ నాయక్ శాఖలో సీనియర్‌గా ఉండడంతో ఆయనకు ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)గా పదోన్నతి కల్పించి, స్టేట్ రోడ్స్ ఈఎన్సీగా బాధ్యతలు ఇచ్చారు. వాస్తవానికి ఈ పోస్టులో సీఈ ఉంటారు. ప్రస్తుతం మోహన్ రిమాండ్‌లో ఉండడంతో సీఈ హోదాలో ఉన్నవారితోనే పోస్టును భర్తీ చేయాల్సి ఉందని శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్త వారికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

# విద్యను వ్యాపారంగా మారుస్తున్న ప్రైవేట్ పాఠశాలలు

**మిరియాల శ్రీనివాస్ నేత**

**ప్రైవేటు పాఠశాలలపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలి**

**విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ప్రైవేటు పాఠశాలలు**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూన్ 11 సూర్యా న్యూస్ విద్యను వ్యాపారంగా మారుస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల శ్రీనివాస్ నేత విజ్ఞప్తి చేశారు. మినీ సూపర్ మార్కెట్ లా ప్రైవేట్ విద్యాసంస్థలు, అక్రమ ఫీజుల వసూళ్లకు పాల్పడుతూ, విద్యాహక్కు చట్టం ఉల్లంఘనలపై విజిలెన్స్ దాడులు చేసి అక్రమార్కులపై కటిన చర్య తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుకు గురువారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నేత మాట్లాడుతూ,ప్రస్తుతం కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో జిల్లాలోని అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా పూర్తిగా వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయన్నారు. పుస్తకాలు, యూనిఫార్మ్‌లు, షూస్, బ్యాగులు, ఇతర విద్యాసామగ్రి పేరుతో ఇష్టానుసారంగా అధిక ధరలు నిర్ణయించి, మార్కెట్ ధరలకు మించి భారీగా వారి ఇష్టనుసారంగా ముద్రించిన ధరలకు ఎక్కువ ధరలు విధిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలను దోచుకుంటున్నారని తెలిపారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం ఎలాంటి సరైన కారణాలు లేకుండా విపరీతంగా ఫీజులను పెంచుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా అనేక విద్యాసంస్థల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు లేకపోయినా, సంబంధిత విద్యాశాఖ అధికారులు సరైన తనిఖీలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతు న్నాయన్నారు. కొందరు అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థలతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకొని చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే భావన ప్రజల్లో బలపడుతోందని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి విద్యార్థికి విద్యను పొందడం ప్రాథమిక హక్కు. విద్యాహక్కు చట్టం ప్రకారం పిల్లలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యతని, అయితే ప్రస్తుతం జరుగుతున్న అధిక ఫీజుల వసూళ్లు, బలవంతపు కొనుగోళ్లు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి చర్యలు విద్యాహక్కు చట్టం అసలు ఉద్దేశ్యాన్నే దెబ్బతీస్తున్నాయన్నారు. విద్యను హక్కుగా కాకుండా వ్యాపార వస్తువుగా మార్చడం అత్యంత దురదృష్టకరం, సిగ్గుచేటని,అందువల్ల జిల్లాలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాహక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవాలని శ్రీనివాస్ నేత అదనపు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బి ఎఆర్ ఎస్ నాయకులు గుజ్జ పవన్, బానోతు శ్రవణ్ నాయక్, దాసరి చరణ్, బానోతు ఆకాష్ నాయక్, గణేష్, మల్లేష్, నాని, తదితర నాయకులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఆలేరు ఎమ్మెల్యే



యాదగిరిగుట్ట మండల జూన్ 11 సూర్య న్యూస్ :- ఆలేరు నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య . తన కార్యాలయం వద్ద లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న పథకాలలో కళ్యాణ లక్ష్మి ఒక ముఖ్యమైన పథకమని తెలిపారు. ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కుమార్తెల వివాహ సమయంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తున్నదని చెప్పారు. అలాగే ఆలేరు నియోజకవర్గంలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు సమన్వయంతో కొనసాగుతున్నాయని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, మహిళా లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి





**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ఇల్లు మంజూరు గాని లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలు అందజేయాలి**

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో డబ్బులు వచ్చే ఏర్పాటు చేయాలి**

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నాణ్యత పై రాజీ పడవద్దు**

**గుడిసెలను గుర్తించి వెంటనే నివేదిక సమర్పించాలి**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూన్ 11 సూర్యా న్యూస్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత అమలు, ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనులు, సెర్ప్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ, మొదటి విడత నిర్మాణాల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఇప్పటి వరకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, ఆ స్థానంలో ఇళ్లు మంజూరు కాని కొత్త లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలను వెంటనే అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక నిర్వహించాలని అధికారులకు సూచించారు. పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, లబ్ధిదారులకు సకాలంలో డబ్బులు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఉపాధి హామీ పథకం పనులను సమర్థవంతంగా అమలు చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న మెటీరియల్ కాంపోనెంట్ పనులను నాణ్యతతో పూర్తి చేయడంతో పాటు, పనుల బిల్లుల చెల్లింపులు, భౌతిక పురోగతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాలలో పెండింగ్ పనులను త్వరత గతిన పూర్తి చేయాలన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, మహిళా సంఘాల అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, ఆర్థిక సాధికారతకు సంబంధించిన అంశాలపై సమీక్షించి, లక్ష్య సాధనకు సమన్వయంతో పనిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గుడిసెలను గుర్తించి వెంటనే ఆ నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, పిడి హౌసింగ్ అలివేలు, పంచాయతీరాజ్ అధికారి దాసయ్య, అడిషనల్ డి ఆర్ డి ఓ సురేష్, ఎంపీడీవోలు, ఏ.ఈ లు, ఏపీఎంలు , తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న రజక సంఘం సభ్యుడిని పరామర్శించిన నాగేల్లి



రామగిరి జూన్ 11 సూర్య న్యూస్:- రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ రజక సంఘం సభ్యుడు ధర్మల భూమయ్య అనారోగ్యశీతో బాధపడుతూ చికిత్స పొందుతూ హాస్పిటల్ నుండి ఇంటికి వచ్చిన సందర్భంగా గురువారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని ధైర్యం చెప్పి అవసరమైతే మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికైన తీసుకు వెళ్లాలని సూచించారు. అవసరం పేరు మేరకు ఆర్థిక సాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని వారికి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామగిరి మండల రజక సంఘం అధ్యక్షుడు ధర్మల రాజయ్య, రత్నాపూర్ మాజీ ఎంపీటీసీ ధర్మముల సంపత్, రజక సంఘం సీనియర్ నాయకుడు ధర్మల శంకర్, ధర్మల వర్షిత్, బూత్కూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నాణ్యత విభాగాధిపతిగా ఆసిఫ్ యాసిన్



రామగిరి జూన్ 11 సూర్య న్యూస్:- సింగరేణి సంస్థ రామగుండం 3 ఏరియా నాణ్యత విభాగాధిపతిగా ఎండీ ఆసిఫ్ యాసిన్ గురువారం విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు రామగుండం 3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ కు రిపోర్ట్ చేశారు. ఆర్జి3 పరిధి ఓసిపి 2లో సేఫ్టీ ఆఫీసర్ గా విధులను నిర్వహిస్తు ఇటీవల జరిగిన బదిలీలలో ఆర్జీ 3 ఏరియా నాణ్యత విభాగాధిపతి గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# పొగాకు నియంత్రణ చర్యలు సమర్థవంతంగా అమలు చేయాలి



**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**కాలేజీలు బస్టాండ్ లు రైల్వే స్టేషన్లు తదితరు చోట్ల నిఘా పెట్టాలి**

**పొగాకు విక్రయ కేంద్రాలు విద్యా సంస్థలకు వంద గజాల దూరంలో ఉండాలి**

**పొగాకు వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

**జిల్లాను పొగాకు రహిత జిల్లాగా మార్చాలి**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూన్ 11 సూర్య న్యూస్ జిల్లాలో పొగాకు నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మే 31న నిర్వహించే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన, అమలు, తనిఖీలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో సి ఓ టి పి ఏ చట్టం2003 నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీస్, మున్సిపల్, విద్య, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్రజా ప్రదేశాలు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, విద్యాసంస్థల పరిసరాల్లో చట్ట ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాసంస్థలకు 100 గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న దుకాణాలను గుర్తించి, విద్యాశాఖ, పోలీస్ శాఖ, మున్సిపల్ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, స్వచ్ఛంద సంస్థలు, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులను పొగాకు వ్యసనానికి దూరంగా ఉంచేందుకు సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలను పొగాకు రహిత విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, నిషేధ బోర్డులు ఏర్పాటు చేయడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, మార్గదర్శకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లాను పూర్తిస్థాయిలో పొగాకు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ, జిల్లా లో పొగాకు వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ర్యాలీలు, వాక్‌థాన్‌లు, ఐఈసీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే పొగాకు వ్యసన నిర్మూలన, మానసిక ఆరోగ్య సేవలకు సంబంధించిన టెలి-మానస్ హెల్ప్‌లైన్ 14416, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉన్న సేవలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. మనోహర్, జిల్లా అగ్నిమాపక అధికారి మధుసూదన్ రావు, డాక్టర్ వీణ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఇందిరా, ఐ. పద్మ, జి. ఇస్తారి, పాటు జిల్లాలోని అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మగ్గం నేస్తున్న వారికి సభ్యత్వం ఇవ్వాలి

**అర్బన్ కాలనీ చేనేత కార్మికులు**

**కులవృత్తిలో లేని వారికి సభ్యత్వం ఇస్తున్న సంఘం**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూన్ 11 సూర్యా న్యూస్ మగ్గంల పై పోచంపల్లి చీరలు నేయుచు జీవితం గడుపుచున్న మాకు జియో టాగ్ నెంబర్ కలిగివున్న 60 మంది భువనగిరి చేనేత సహకార సంఘంలో సభ్యత్వం ఇవ్వాలని యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని అర్బన్ కాలనీ చేనేత కార్మికులు జిల్లా హ్యాండ్లూమ్ ఏడి శ్రీనివాస్ కు గురువారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత సంవత్సరం సెప్టెంబర్ 26న జనరల్ బాడీ సమావేశంలో దరఖాస్తు ఇచ్చినామని,సంఘం అధ్యక్షులు సభ్యత్వం ఇచ్చే అధికారం మాకు లేదని తెలిపారని సంఘం లెటర్ పై వ్రాసి ఇచ్చాడని తెలిపారు. తదుపరి మళ్ళీ జనరల్ బాడీ సమావేశంలో కూడా దరఖాస్తులు ఇచ్చినామని, మగ్గం నేయుచున్న వారికి నూతన సభ్యత్వంలు ఇస్తానని సంఘం అధ్యక్షులు తెలిపారన్నారు. అయితే నిజమైన చేనేత కార్మికులకు సభ్యత్వం ఇవ్వకుండా, వారికి నచ్చిన వారికి సభ్యత్వం ఇచ్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబాల వారికి, కుల వృత్తిలో లేని వారికి కూడా సభ్యత్వం ఇచ్చారన్నారు. అలాగే మాకు సంఘంలో ఓటు లేకున్నా కనీసం సభ్యత్వం రసీదులు ఇప్పించాలని వారు జిల్లా అధికారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో సురేష్, అంబికా, స్వరూప, హరిత, చంద్రకళ, బడుగు శంకర్, యాదగిరి, ఆంజనేయులు, తదితరులు పాల్గున్నారు.

సూర్య
శుక్రవారం 12 - 06 -2026

# జిల్లాలో బ్యాంకింగ్ రంగం విశేష పురోగతి






**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**202627 వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణ**

**రుణాల పంపిణీ సంతృప్తికరం**

**ప్రభుత్వ శాఖలు బ్యాంకులు సమన్వయ కృషి కీలకం**

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూన్ 11 సూర్య న్యూస్** యాదాద్రి భువనగిరి జిల్లాలో బ్యాంకులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాంకింగ్ రంగ పనితీరును సమీక్షించడంతో పాటు, 202627 వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.202526 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని బ్యాంకులు వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.6,717.58 కోట్లకు గాను రూ.7,997.00 కోట్ల రుణాలను పంపిణీ చేసి 119.05 శాతం ప్రగతిని నమోదు చేశాయన్నారు.ప్రాధాన్యతా రంగంలో రూ.5,392.24 కోట్ల లక్ష్యానికి గాను రూ.5,656.59 కోట్ల రుణాలు పంపిణీ చేసి 104.90 శాతం సాధించాయని తెలిపారు.వ్యవసాయ రంగంలో రూ.4,341.82 కోట్ల లక్ష్యానికి గాను రూ.4,893.37 కోట్ల రుణాలను పంపిణీ చేసి 112.70 శాతం ప్రగతిని నమోదు చేశాయి. ఎంఎస్ఎంఈ రంగంలో రూ.694.37 కోట్ల రుణాలు పంపిణీ చేయగా, చిన్న పరిశ్రమల విభాగం 226.62 శాతం ప్రగతిని నమోదు చేసింది. ప్రాధాన్యతా రంగ గృహ రుణాలు, విద్యా రుణాల పంపిణీ కూడా సంతృప్తికరంగా కొనసాగింది.ప్రాధాన్యతేతర రంగంలో రూ.1,325.34 కోట్ల లక్ష్యానికి గాను రూ.2,340.41 కోట్ల రుణాలు పంపిణీ చేసి 176.59 శాతం ప్రగతిని నమోదు చేశాయి. ముఖ్యంగా వ్యక్తిగత రుణాల విభాగంలో 413.64 శాతం సాధన నమోదైందన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. జిల్లాకు మొత్తం రూ.7,848.60 కోట్ల రుణ ప్రణాళికను రూపొందించగా, ఇది గత సంవత్సరం లక్ష్యంతో పోలిస్తే 16.84 శాతం వృద్ధిని సూచిస్తుంది.ప్రాధాన్యతా రంగానికి రూ.6,337.71 కోట్లు కేటాయించగా, అందులో వ్యవసాయ రంగానికి రూ.4,978.44 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1,182.53 కోట్లు కేటాయించారు. వ్యవసాయ రంగంలో పంట రుణాలకు రూ 2,766.72 కోట్లు ప్రతిపాదించారు.ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1,182.53 కోట్ల వార్షిక రుణ లక్ష్యాన్ని ప్రతిపాదించారు. అదనంగా విద్యా రుణాలు, గృహ రుణాలు, సామాజిక మౌలిక సదుపాయాలు మరియు పునరుత్పాదక ఇంధన రంగాలకు ప్రత్యేక కేటాయింపులు చేశారు. ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలులో భాగంగా ప్రధాన మంత్రి ముద్ర యోజన కింద 14,367 మంది లబ్ధిదారులకు రూ.239.02 కోట్ల రుణాలు పంపిణీ చేయబడినట్లు సమావేశంలో వెల్లడించారు.డీఆర్‌డీఏసెర్ప్ స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజ్ కార్యక్రమం కింద రూ.611.18 కోట్ల లక్ష్యానికి గాను రూ.650.88 కోట్ల రుణాలు పంపిణీ చేసి 106.50 శాతం ప్రగతిని సాధించగా, మెప్మా స్వయం సహాయక సంఘాలకు రూ.123.28 కోట్ల రుణాలు పంపిణీ చేసి 121.24 శాతం లక్ష్య సాధన నమోదు చేశారు. ప్రధాన మంత్రి స్వనిధి పథకం కింద మొదటి విడతలో 7,367, రెండవ విడతలో 4,318, మూడవ విడతలో 1,305 దరఖాస్తులు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలైన పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, జన సురక్ష పథకాల లక్ష్యాలను బ్యాంకులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఆర్థికాభివృద్ధి,వ్యవసాయాభివృద్ధి, స్వయం ఉపాధి, మహిళా సాధికారత, ఆర్థిక సమగ్రత సాధనలో బ్యాంకులు, ప్రభుత్వ శాఖలు, అభివృద్ధి సంస్థల సమన్వయ కృషి కీలకమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రవీందర్, ఎల్‌డీఎం వీరన్న, ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మీ శ్రావ్య, నాబార్డ్ డీడీఎం ఝాన్సీతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లులు పాల్గొన్నారు.

# ప్రైవేటు వైద్య సంస్థలు రోగుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి






**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ప్రవేట్ వైద్య సంస్థలు ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి**

**ప్రైవేటు వైద్యశాలను చట్ట ప్రకారం నిర్వహించాలి**

**కొత్తగా నిర్మించబోయే వైద్య సంస్థలపై సమీక్ష**

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూన్ 11 సూర్య న్యూస్** ప్రైవేటు వైద్య సంస్థలు వైద్య సేవలో నాణ్యత పెంపొందించ డంతోపాటు రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్ లో గురువారం నిర్వహించారు.ఈ సమావేశంలో క్లినికల్ ఎ స్టబ్లిషమెంట్స్ (రిజిస్ట్రేషన్, రెగ్యులేషన్ ) యాక్ట్ , 2010 నిబంధనల ప్రకారం జిల్లాలోని ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లకు శాశ్వత నమోదు (పెర్మనెంట్ రిజిస్ట్రేషన్ ) మంజూరు ప్రక్రియకు సంబంధించిన అంశాలను సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలోని వివిధ వైద్య సంస్థల నుండి శాశ్వత నమోదు కోసం అందిన 17 పెండింగ్ దరఖాస్తులపై, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గతంలో ఏర్పాటు చేసిన తనిఖీ బృందాలు సమర్పించిన తనిఖీ నివేదికలను కమిటీ సభ్యులు పరిశీలించారు. ఆయా వైద్య సంస్థలు చట్టంలో పేర్కొన్న ప్రమాణాలను పాటిస్తున్నాయా లేదా అనే అంశాలపై విస్తృతంగా చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.

అలాగే, జిల్లాలో కొత్తగా 16 శాశ్వత నమోదుకు దరఖాస్తు చేసుకున్న మరికొన్ని ప్రైవేటు వైద్య సంస్థల తనిఖీల కోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృందాల ద్వారా తనిఖీలు చేయడం కొరకు అనుమతులు మంజూరు చేయడం జరిగింది. సమావేశంలో వైద్య సంస్థలలో ఫైర్ సేఫ్టీ ప్రమాణాల అమలుపై ప్రత్యేకంగా చర్చించారు. ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాలలో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ల నిర్వహణ, సిబ్బందికి శిక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించడం జరిగింది. ప్రతి వైద్య సంస్థ తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించాలని కలెక్టర్ గారు సూచించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ, జిల్లా లో వైద్య సేవల నాణ్యత పెంపొందించడంతో పాటు రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, క్లినికల్ ఎ స్టబ్లిషమెంట్స్ యాక్ట్ -2010 నిబంధనలను ప్రతి వైద్య సంస్థ కచ్చితంగా అమలు చేయాలని ఈ సమావేశంలో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మినారాయణ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.యం. మనోహర్, జిల్లా ఫైర్ అధికారి మధుసూదన్ రావు, నోడల్ ఆఫీసర్ డా. వీణ, డా.ఇందిరా, ఐఎంఏ వైస్ ప్రెసిడెంట్, యై. పద్మ పాల్గొన్నారు.

# గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల కొరకై ఆహ్వానం

**కళాశాల రీజనల్ కో ఆర్డినేటర్ స్వప్న**

**ఇంటర్లో 50 శాతం ఇంగ్లీష్ లో 40 శాతం మార్కులు సాధించిన వారికి అవకాశం**

**ఆసక్తి గల విద్యార్థులు తల్లిదండ్రులతో కళాశాలకు వచ్చి ప్రక్రియ పూర్తి చేసుకోవాలి**



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూన్ 11 సూర్యా న్యూస్** యాదాద్రి భువనగిరి జిల్లా అనంతారంలోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (పురుషులు)లో 202627 విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ కొనసాగుతున్నాయని గురువారం కళాశాల నల్గొండ రీజినల్ కోఆర్డినేటర్ ఇ. స్వప్న తెలిపారు. ఇంటర్‌మీడి యట్‌లో కనీసం 50 శాతం మార్కులు, ఇంగ్లీష్‌లో 40 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. కళాశాలలో బీఎస్సీ, (ఎంపీసీ ), బీఎస్సీ (ఎంపీసీస్ ), బీఎస్సీ ( ఎం ఎస్ సి ఎస్ ), బీఎస్సీ ( బి జెడ్ సి ), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బి ఏ ( ఈ పి హెచ్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఆసక్తి గల విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి నేరుగా కళాశాలను సందర్శించి ప్రవేశ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7670858056, 9948984800, 9100704131 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

# జర్నలిస్టుల పిల్లల ఫీజుల్లో రాయితీ కల్పించండి టిడబ్ల్యూజేఎఫ్

**జిల్లా ఇంటర్మీడియట్ అధికారికి జిల్లా విద్యాశాఖ అధికారికి టీడబ్ల్యూజేఎఫ్ వినతి**

**జర్నలిస్టుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్న అధికారులు**



**చంద్రుగొండ జూన్ 11 సూర్య న్యూస్** ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టు పిల్లలకు 2026 - 27 సంవత్సరానికి సంబంధించిన ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని కోరుతూ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టీజేఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కో కన్వీనర్ జి వెంకటేశ్వర్లు, ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హెచ్ వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏసిజీఈ హెచ్ మాధవరావు, సీనియర్ సూపర్డెంట్లు శ్రీధర్ స్వామి, సురేష్ లకు వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా జిల్లా కో కన్వీనర్ జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.... భద్రాద్రి జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టుల పిల్లలకు ప్రతి విద్యా సంవత్సరం ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తున్నందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అన్నారు. ప్రస్తుతం జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. దాదాపు 80 శాతం జర్నలిస్టులు వేతనాలు లేక నెలవారీ ఆదాయం లేక తమ పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఫీజులు కట్టలేక పోతున్నారని కావున జర్నలిస్టుల పిల్లలకు ప్రతి సంవత్సరం లాగానే ఈ 2026-27 విద్యా సంవత్సరాల్లో ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరడం జరిగిందన్నారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రాయితీ అమలు చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ రామిశెట్టి సైదయ్య, జిల్లా ఫెడరేషన్ సభ్యులు నేరెళ్లకుంట్ల సుధాకర్ రావు,వి రాజేందర్, పి రాధాకృష్ణ, పి లెనిన్ విజయ్ కుమార్, కుంజా వెంకటేష్, ఎస్ కే జాఫర్, తేజవత్ వెంకటేష్, రాచకొండ నాగేశ్వరరావు, ఎస్ డి రబ్బాని, వీరబోయిన రాంబాబు, ఏ శ్రీను, జె సంపత్, కే సంపత్, జి నాగరాజు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు జూన్ 13న ఉద్యోగ మేళా

**హెచ్ సి ఎల్ టెక్ బీ- డిఐఈఓ అనుమతితో సాఫ్ట్వేర్ రంగంలో**

**హనుమకొండ టౌన్ జూన్ 11 సూర్య న్యూస్:-**హన్మకొండ జిల్లా డిఐఈఓ అనుమతితో హెచ్ సి ఎల్ టెక్నాలజీస్ వారు నిర్వహిస్తున్న టెక్ బి ప్రోగ్రాంలో భాగంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు జూన్ 13, 2026 రోజున ఉదయం 11:00 గంటలకు ఐసిఎస్ఎస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్ హన్మకొండ మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా డిఐఈఓ గోపాల్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ రంగ, ప్రైవేట్ కళాశాలలలో 2025- 2026 సీసీఈ, బైపిసి , ఒకేషనల్ గ్రూప్స్ లో 75%తో అర్హులైన అభ్యర్థులుతమ పదో తరగతి, ఇంటర్మీడియట్,ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు,ఒక ఫోటో, ఆండ్రాయిడ్ మొబైల్ తో డ్రైవ్ స్థలానికి హాజరుకావాలని కోరారు.పూర్తి వివరాలకు హెచ్.సి. ఎల్. ప్రతినిది సెల్ఫోన్ నెంబర్ ను 7569177071 సంప్రదించాలని పేర్కొన్నారు.

# పుట్ట మధు అనుచిత వ్యాఖ్యలు సరికాదు

**-అభివృద్ధి గురించి మాట్లాడండి**

**-వ్యక్తిగత దూషణలు కాదు**

**-ఐఎన్టియుసి అర్జీ 3 వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి**

**రామగిరి జూన్ 11 సూర్య న్యూస్:-** మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుపై చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను ఐఎన్టియుసి పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ సమయంలో ప్రజల మధ్య కనిపించని వ్యక్తికి ఉద్యమ పార్టీ ఒకసారి అవకాశం ఇస్తే, ఆ అవకాశాన్ని ప్రజల అభివృద్ధికి కాకుండా వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించారన్నారు. అందుకే మంథని ప్రజలు వరుసగా తిరస్కరిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. కులం కన్నా గుణం ముఖ్యం. బహుజన బిడ్డల పేరుతో కపట రాజకీయాలు, సానుభూతి నాటకాలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అభివృద్ధి, అందుబాటు, ప్రజాసేవను చూసే మంథని ప్రజలు శ్రీధర్ బాబును ఐదుసార్లు గెలిపించారని అన్నారు. సింగరేణి బకాయిలు, ఆర్థిక సమస్యలకు కారణం గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలేనని పేర్కొన్నారు. అధికారం ఉన్నప్పుడు సింగరేణిని నిర్వీర్యం చేసి, ఇప్పుడు సింగరేణి పరిరక్షణ పేరుతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత సింగరేణి కార్యాలయాలను తగలబెట్టాలని బహిరంగ సభల్లో మాట్లాడిన వారు, నేడు సింగరేణి రక్షకులమంటూ మాట్లాడటం హాస్యాస్పదం. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేకపోవడంతోనే చౌకబారు ఆరోపణలు, రాజకీయ డ్రామాలు చేస్తున్నారని ప్రజలు గుర్తించారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని, తగిన సమయంలో ఓట్ల రూపంలో సమాధానం చెబుతారని హెచ్చరించారు. గౌరవప్రదమైన పదవులు చేపట్టిన వ్యక్తులు హుందాగా మాట్లాడాలి. వ్యక్తిగత దూషణలు, చిల్లర రాజకీయాలు, అనుచిత భాషను ఇప్పటికైనా మానుకోవాలి. మాట్లాడే మాటల్లో, ప్రవర్తనలో మార్పు తీసుకురావాలి. లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు అని కోట రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సెంట్రల్ కమిటీ నాయకులు, బ్రాంచ్ కమిటీ, పిట్ సెక్రెటరీ లు, వివిధ ఏరియా,మైన్, డిపార్ట్మెంట్ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బిజెపి పాలనలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం

**సిపిఎం నాయకులు వీరయ్య**

**రూపాయి విలువ పతనం అయ్యింది**

**నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి**

**ప్రజలు వాస్తవాలను గమనించి బిజెపి పాలన ఎండగట్టాలి**

**రైతులను నిలువునా ముంచే మూడు నల్ల చట్టాలు**

**కార్మికుల బతుకులను నాశనం చేసే లేబర్ కోడ్ లు**

**దేశంలో పెరిగిపోయిన మతోన్మాద దాడులు**

**దళితులు గిరిజనులు పై అత్యాచారాలు**

**మీడియా గొంతు నొక్కి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి**




**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూన్ 11 సూర్యా న్యూస్** బిజెపి అధికారంలోకి వచ్చిన 12 ఏళ్ల కాలంలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని రూపాయి విలువ పతనం అయిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య తెలిపారు. గురువారం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వీరయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ,

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 ఏళ్ల పాలనలో ప్రజల జీవన స్థితిగతులు అస్తవ్యస్తంగా మారాయని తీవ్రమైన ఆర్థిక సంక్షోభం రూపాయి విలువ పతనమైందని, 2014లో డాలర్ విలువ 58 రూపాయలు ఉంటే 2026 వచ్చేసరికి 96 రూపాయలు దిగజారిందన్నారు. అదేవిధంగా ప్రజలు నిత్యం ఉపయోగించే పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచి పేద మధ్యతరగతి ప్రజలపై ధరల భారాన్ని మోపారని, దేశంలో ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరగడం వల్ల విదేశీ మారక నిలువలు తగ్గాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో లీటర్ పెట్రోల్ 56 రూపాయలు ఉంటే 2026 వచ్చేసరికి 110 రూపాయలు పెరిగిందని ఎల్పిజి గ్యాస్ 2014లో 414 రూపాయలు ఉంటే ప్రస్తుతం 965 రూపాయలు పెరిగిందన్నారు. 12 ఏళ్ల పాలనలో రైతాంగాన్ని నిలువునా ముంచే మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చారని, కార్మికులను వారి బతుకులను గందరగోళపరిచే నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని ప్రభుత్వం రంగాన్ని దివాలా తీయించి ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించిందని, మతోన్మాద దాడులు తీవ్రతరం అయ్యాయని దళితులు గిరిజనులపై అత్యాచారాలు పెరిగినవని, మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగాయన్నారు. అబద్దాలతో బీజేపీ రాజ్యమేలుతూ మీడియా గొంతునొక్కి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందన్నారు. సర్ పేరుతో బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించాలని చూస్తున్నారని. ఉదాహరణ బెంగాల్, బీహార్ ఎన్నికలని తెలిపారు. వాస్తవాలను ప్రజలు గమనించి బిజెపి పాలనను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లా అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని జిల్లా అభివృద్ధికి కేటాయించవలసిన బడ్జెట్లో కనీసం ప్రజల ఆరోగ్యాలకు సంబంధించిన ఎయిమ్స్ కు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడం, బీబీనగర్, భువనగిరి, వంగపల్లి ఆలేరు రైల్వేస్టేషన్ల ఆధునికరణకు నిధులు కేటాయించలేదని. రైల్వే లైన్ విస్తరణలో భూములు కోల్పోతున్న కనీసం పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కేంద్ర మంత్రులు జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయింపు విషయంలో మాట్లాడలేదన్నారు. బిజెపి 12 ఏళ్ల పాలన వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ధపాలవారి కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు.

ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జెల్లెల పెంటయ్య, బూరుగు కృష్ణారెడ్డి, గుంటోజు శ్రీనివాసాచారి, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిర్పంగి స్వామి, దయ్యాల నరసింహ, మాయ కృష్ణ,బొల్లు యాదగిరి, మద్దెల రాజయ్య, ఎండి పాష, బొడ్డుపల్లి వెంకటేష్, గంగదేవి సైదులు, అవ్వారు రామేశ్వరి, ఎంఎ ఇక్బాల్, వనం ఉపేందర్, గడ్డం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరిలో బస్ డిపో ఏర్పాటు చేయాలి

**మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి**

**ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సూచనలతో వినతి**

**రాత్రి వేళలో బస్సు సౌకర్యం కల్పించాలి**

**సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ ఎండీ**



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూన్ 11 సూర్యా న్యూస్** భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సూచనల మేరకు భువనగిరి పట్టణంలో బస్ డిపో ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్పర్సన్ తంగెళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ టీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని కోరారు. గురువారం భువనగిరి బస్టాండ్ను సందర్శించిన ఎండీ నాగిరెడ్డిని చైర్పర్సన్ శ్రీవాణి రవికుమార్ కలిసి పట్టణ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. భువనగిరి బస్టాండ్లో అన్ని బస్సులు హాల్ట్ అయ్యే విధంగా చూడాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సలహాతో జిల్లా కేంద్రమైన భువనగిరిలో బస్ డిపో అవసరాన్ని ఎండీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. డిపో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.వినతులపై సానుకూలంగా స్పందించిన ఎండీ నాగిరెడ్డి, ఎమ్మెల్యే సూచించిన విధంగా బస్ డిపో ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తంగంపల్లి రవికుమార్, వైస్ చైర్మన్ పోతం శెట్టి మంజుల వెంకటేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్తీ, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు నరసింహ, పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్, ముఖ్య కాంగ్రెస్ నాయకులు, బెండ లాల్ రాజ్, పిట్టలా బాల రాజ్, బబ్లు,మజర్ షఫీక్ అహ్మద్, కూర శివ కుమార్, మహమ్మద్ రఫీద్దీన్ గౌరీ, గుమిడెల్లి రమేష్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీర్కూర్ లో ఘనంగా శతవసంతాల ఉత్సవ

**శతవసంత ఉత్సవ కార్యక్రమానికి హాజరైన**

**నాలుగు తరాల కుటుంబ సభ్యులు**



**కామారెడ్డి జిల్లా బ్యూరో జూన్ 11 సూర్య న్యూస్ :-** బీర్కూర్ గ్రామంలో నీ మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ నందు ఎన్నువార్ సాయమ్మ భర్త కీర్తిశేషులు గంగారం వారి శతవసంతోత్సవ వేడుకలను నాలుగు తరాల కుటుంబ సభ్యుల మధ్య అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు పిల్లలతో కలిసి మంగళ వాయిద్యాల మధ్య స్వాగతం పలికి ఆయురారోగ్యాల కోసం గణపతి పూజ లలిత సహస్రనామం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలు మనవాళ్లు కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. శాలువా పూలదండ జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. పాత ఫోటోలు వీడియోలతో స్వాతంత్రం నుండి స్మార్ట్ఫోన్ వరకు వారు చూసిన అన్ని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం కేక్ కటింగ్ చేసి కుటుంబ సభ్యులు ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్ను వార్ సాయమ్మ పేరు మీద అన్నదానం, వృద్ధాశ్రమానికి విరాళం మొక్కలు నాటడం ఇలాంటి కార్యక్రమాలు చేశామని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నువార్ కుటుంబానికి చెందిన నాలుగు తరాల కు చెందిన అందరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# తుర్క చెరువును అభివృద్ధిపరిచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తాం: ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గౌడ్



**కుత్బుల్లాపూర్ జూన్ 11 సూర్య న్యూస్ :-** సిఎంసి నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధి బండారి లేఅవుట్, తుర్క చెరువు ప్రాంతాలలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గౌడ్ ప్రజా సమస్యలపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు లో ప్రెజర్ తో నీటి సరఫరా, లైబ్రరీ పైకప్పు లీకేజీ, ఒంటరి మహిళలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, నూతన రేషన్ కార్డులు, పెన్షన్లు, ఎస్ఎన్డిపి పనుల వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వర్షం వచ్చిన ప్రతిసారి బండారి లేఔట్ లోని ప్రజలు వరద నీటి సమస్యతో భయాందోళనకు గురయ్యేవారని గత 12 ఏళ్ల కాలంలో ఎస్ఎన్డిపి పనుల ద్వారా వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. బండారి లేఔట్ లోని లైబ్రరీ పైకప్పు లీకేజీ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి పైకప్పు లీకేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయింప చేయడంతో పాటు పెన్షన్లను, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి రేషన్ కార్డులను ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో ఎస్ ఎన్ డి పి పనుల ద్వారా బండారి లేఔట్ లో వరద మంపు తీవ్రతను తగ్గించామని, రానున్న రోజుల్లో కూడా ఎస్ ఎన్ డి పి ఫేస్ -2 పనులను త్వరితగతిన పూర్తి చేసి వరద ముంపు సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో కలసి తుర్క చెరువును సందర్శించిన ఎమ్మెల్యే చెరువులో మురుగునీరు కలవకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మురుగునీటిని బయటకు పంపించి వాకింగ్ ట్రాక్, పిల్లల కోసం ఆట సామాగ్రి తో పాటు చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాబేర్ అలీ, ఇరిగేషన్ డీఈ నాయక్, ఈఈ సురేష్ బాబు, వాటర్ వర్క్స్ మేనేజర్ సౌమ్య, ఏఈ రవీంద్ర నాయక్, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



# సమన్వయంతో రహదారి విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**కడిపికొండబొడ్రాయి రహదారి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి**



**హనుమకొండ టౌన్ జూన్ 11 సూర్య న్యూస్:-** ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను సమన్వయంతో, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు అధికారులను ఆదేశించారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరేడ్డిలతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కడిపికొండ నుంచి బొడ్రాయి వరకు ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో 1.6 కిలోమీటర్ల మేర చేపడుతున్న రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రహదారి విస్తరణ, డ్రైనేజీ నిర్మాణం, యుటిలిటీల మార్పిడి, ఇతర అనుబంధ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. రోడ్డు విస్తరణకు అనుగుణంగా వర్షపు నీరు నిల్వ కాకుండా రహదారి ఇరువైపులా అవసరమైన డ్రైనేజీ వ్యవస్థను శాస్త్రీయ పద్ధతిలో ఏర్పాటు చేయాలని జీడబ్ల్యూఎంసీ అధికారులకు సూచించారు. పనుల నిర్వహణలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.అభివృద్ధి పనుల అమలులో సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంపొందించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, జీడబ్ల్యూఎంసీ సిటీ ప్లానర్ రవీంద్ర వాడేకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంగం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం




**కామారెడ్డి జిల్లా బ్యూరో జూన్ 11 సూర్య న్యూస్ :-** సంగం సర్పంచ్ మాలోత్ ఉమారాణి వినోద్, సంగం ఏ డి రుణ్ నాయక్ ఆధ్వర్యంలో లోటస్ హెల్త్ కేర్ జనరల్ హాస్పిటల్, డెంటల్ క్లినిక్ వారు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులను శాలువాలతో సత్కరించారు. వైద్య బృందం స్థానిక ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు, సలహాలు అందించింది.

## జలాల్‌పూర్ ఉపాధి హామీ కూలీలు పనుల మధ్యే షష్టిపూర్తి



**కామారెడ్డి జిల్లా బ్యూరో జూన్ 11 సూర్య న్యూస్ :-** షష్టిపూర్తి అంటే 60 ఏళ్లు నిండినప్పుడు చేసే వేడుక. ఆయుష్షు, ఆరోగ్యం కోసం మళ్లీ పెళ్లి తంతు జరిపిస్తారు. తలపై ఆకు, పూలదండలు, పట్టు బట్టలు ఇందులో భాగం ఉపాధి హామీ కూలీలందరూ కలిసి వీరికి ఇలా సంబరం చేయడం చూస్తే ఆత్మీయత తెలుస్తోంది. పని ప్రదేశమే పెళ్లి వేదిక అయ్యింది. కష్టంతో పాటు సంబరాలను కూడా పంచుకునే వీరి బంధం గొప్పది. గ్రామస్తులు పేర్కొన్నారు.

# మహానగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలి



**కుత్బుల్లాపూర్ జూన్ 11 సూర్య న్యూస్ :-** జీడిమెట్ల డివిజన్ పరిధిలోని మహానగర్ కాలనీలో గత ఐదు రోజులుగా డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతూ రోడ్లన్నీ మురుగునీటితో నిండిపోయాయి. కాలనీలోని దేవాలయం ముందు కూడా మురుగునీరు ప్రవహిస్తుండటంతో భక్తులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల ముందు వరకు మురుగునీరు చేరడంతో ప్రజలు బయటకు రావడానికే ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై నడవలేని పరిస్థితి నెలకొంది. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఫోన్ ద్వారా సమాచారం అందించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. అధికారులు వెంటనే స్పందించి మహానగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని మహానగర్ కాలనీ అధ్యక్షుడు కుమార్ విజ్ఞప్తి చేశారు.

# జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలి.

**విద్యాశాఖ అధికారికి టీయూడబ్ల్యూజే(ఐజేయూ) వినతి.**

**డోర్నకల్ ప్రతినిధి జూన్ జూన్ 11 సూర్య న్యూస్:-** జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయూ) జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి మందుల శ్రీరాములకు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారని అన్నారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా జర్నలిస్టుల కుటుంబాలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని, వారి పిల్లల విద్యాభారం తగ్గించే దిశగా జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో నూరుశాతం ఫీజు రాయితీ అమలు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల పిల్లలకు విద్యలో ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం, విద్యాసంస్థలు సానుకూల నిర్ణయం తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గందసిరి రవి, జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మగాని మధు, కురవి మండల అధ్యక్షుడు గుంటి సురేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పూర్ణచందర్, వెంకన్న, సీతారాం తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల నమోదు లక్ష్య సాధనకు సమిష్టి కృషి చేయాలి : కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

**పాఠశాలలో మౌలిక వస్తువుల కల్పనకై ప్రత్యేక దృష్టి సారించాలి**

**జిల్లాలో మొత్తం 672 ప్రభుత్వ పాఠశాలలు**

**481 ప్రాథమిక, 8 ఉన్నత ప్రాథమిక, 183 ఉన్నత పాఠశాలలు**

**జిల్లాలో అదనంగా 275 ప్రీ-ప్రైమరీ పాఠశాలలకు అనుమతులు మంజూరు**

**జిల్లాలోని పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**



హైదరాబాద్ జిల్లా బ్యూరో జూన్ 11 సూర్య న్యూస్ :- జిల్లాలోని బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల నమోదు ప్రక్రియ, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు, ప్రత్యేక అవసరాలున్న పిల్లల విద్య, అలాగే 2026–27 విద్యా సంవత్సరానికి సన్నద్ధత తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 672 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వాటిలో 481 ప్రాథమిక పాఠశాలలు, 8 ఉన్నత ప్రాథమిక పాఠశాలలు, 183 ఉన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 25 ప్రీ-ప్రైమరీ పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు, అదనంగా 275 ప్రీ-ప్రైమరీ పాఠశాలలకు అనుమతులు మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థుల ఆధార్ ప్రక్రియ 59 శాతం ఉండగా మిగతా ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అలాగే అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఉపాధ్యాయుల కొరత వంటి మౌలిక , పరిపాలనా సమస్యలను గుర్తించాలని సూచించారు. అదేవిధంగా 10 శాతం అదనపు నమోదు లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం, తల్లిదండ్రులతో ప్రత్యక్ష సంప్రదింపులు, సామాజిక భాగస్వామ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జూన్ 15న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభమైన వెంటనే యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలుగు, ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో తక్కువ నమోదు ప్రక్రియ అంశంపై సమీక్షిస్తూ, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆంగ్ల మాధ్యమ విద్యపై ఆసక్తి చూపుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, అవసరమున్న ప్రాంతాల్లో ఆయా పాఠశాలలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలలుగా మార్చే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. బడిబాట కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం కింద 600 మంది పిల్లలను గుర్తించగా, ఇప్పటివరకు 334 మంది బడి మానేసిన అలాగే పాఠశాలలకు దూరమైన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించినట్లు అధికారులు వివరించారు. జిల్లాలో ఒక్క విద్యార్థి కూడా విద్యకు దూరంగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచాలని, తద్వారా ఉత్తీర్ణత శాతాలను పెంచాలని సూచించారు. సమావేశంలో అధికారులు జిల్లాలో కృత్రిమ మేధస్సు (ఏ ఐ), డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. భాషా మరియు గణిత అభ్యాసాన్ని మెరుగుపరచేందుకు 25 పాఠశాలల్లో ఏఎక్స్ఎల్ (సహాయక భాష మరియు గణిత అభ్యాసం) ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం నిర్వహిస్తున్న భవిత కేంద్రాల పనితీరును కూడా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని 24 భవిత కేంద్రాల్లో ప్రస్తుతం 431 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని అధికారులు తెలిపారు. వారికి స్పీచ్ థెరపిస్టులు, ఫిజియోథెరపిస్టుల ద్వారా నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు 5,774 మంది ప్రత్యేక అవసరాలున్న పిల్లలను సాధారణ పాఠశాలల్లో విలీనం చేసినట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. అకడమిక్ పర్యవేక్షణ వ్యవస్థ, పాఠశాలల తనిఖీ విధానం, గత పదేళ్ల ఎస్ఎస్‌సీ ఫలితాలు అలాగే ఉత్తీర్ణత శాతాలపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, ప్రభుత్వ పాఠశాలల పనితీరు బలోపేతానికి సంబంధించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు జితేందర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, ఉప విద్యాశాఖ అధికారులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కె.ఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ వోకేషనల్ జూనియర్ కళాశాల సప్లమెంటరీ ఫలితాలు




కుత్బుల్లాపూర్ జూన్ 11 సూర్య న్యూస్ :- కె.ఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ వోకేషనల్ జూనియర్ కళాశాల కుత్బుల్లాపూర్ ఐ పి ఈ సప్లమెంటరీ ఫలితాలు 2025- 26 సంవత్సరంలో ఐదు గ్రూపుల్లో, ఫార్మా టెక్నాలజీ 100%, కంప్యూటర్ సైన్స్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఎం పి హెచ్ డబ్ల్యు 90% విద్యార్థులు పాసయ్యారు, సమీరా ఎం ఎల్ టి ఇంప్రూవ్మెంట్లో 486/500 మార్కులు, అంకిత్ ఈ టీ ఇంప్రూమెంట్లో 482/500 మార్కులు సాధించారు, కళాశాల ప్రిన్సిపల్ షేక్ మైమూన్ విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.

## ఘనంగా నర్సిరెడ్డి భూపతి జన్మదిన వేడుకలు



కొంపల్లి జూన్ 11 సూర్యన్యూస్ :- నర్సిరెడ్డి భూపతి రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి ప్రశాంత్ గౌడ్, జయభేరి గోపాల్, అంజి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ డప్పు కిరణ్



కొంపల్లి జూన్ 11 సూర్య న్యూస్ :- దూలపల్లి డివిజన్ పరిధిలోని ఎన్నో ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్‌లు నేటి జనాభా అవసరాలకు సరిపోకపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా మారి, మురుగునీరు రోడ్ల పైకి పొంగిపొర్లుతోందని మాజీ కౌన్సిలర్ ఎమ్మెల్యేకు వివరించారు. కాలనీవాసుల ఇబ్బందులు పడుతూ మురుగు నిలిచిపోవడం వల్ల దోమలు పెరిగి, కాలనీలలో తీవ్ర అపరిశుభ్రత, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త పైప్ లైన్ల వేయాలని సమస్యకు తాత్కాలిక మరమ్మతులు కాకుండా, శాశ్వత పరిష్కారం కోసం నూతన డ్రైనేజీ పైప్ లైన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహ, వీరేష్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాకు చెందిన బాధిత బాలికను పరామర్శించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు



హైదరాబాద్ జిల్లా బ్యూరో జూన్ 11 సూర్య న్యూస్ :- తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు శవందన గౌడ్, బండి అపర్ణ, చందన మారిపల్లి పంజాగుట్ట లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖమ్మం జిల్లాకు చెందిన బాధిత బాలికను, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు వైద్యులను, ఆసుపత్రి అధికారులను కలిసి బాలిక ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలు, తదుపరి చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. బాలికకు అవసరమైన వైద్య సేవలను నిరంతరంగా అందించాలని వైద్యులను కోరారు. బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడిన కమిషన్ సభ్యులు వారికి ధైర్యం చెప్పారు. బాలికకు న్యాయం జరిగేలా, అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా కమిషన్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. బాలిక కుటుంబం ఆర్థికంగా బలహీన వర్గానికి చెందినదని, చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆసుపత్రిలోనే ఉండాల్సి రావడంతో ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషన్ గుర్తించింది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య ఖర్చులు భరించబడుతున్నప్పటికీ, కుటుంబానికి జీవనోపాధి, ప్రయాణం, ఆహారం, ఇతర అత్యవసర అవసరాల కోసం ప్రత్యేక ఆర్థిక సహాయం అవసరమని అభిప్రాయపడింది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు బాధిత బాలికకు, కుటుంబానికి అవసరమైన సహాయం, పునరావాసం, కౌన్సెలింగ్, బాధిత సహాయ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న సేవలను తక్షణం అందించాలని కమిషన్ ఆదేశించింది. బాలిక పూర్తి ఆరోగ్యంతో కోలుకొని సాధారణ జీవితంలోకి తిరిగి రావడానికి అన్ని శాఖలు సమన్వయంతో కలసి పనిచేయాలని కమిషన్ సూచించింది.

## సాయి హారతి పూజ లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



శేరిలింగంపల్లి జూన్ 11 సూర్య న్యూస్ :- ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లో డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ నిర్మించిన శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా వెంకటేష్ గౌడ్ హారతి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జి.ఎస్.ఆర్ నగర్ వాస్తవ్యులు నాగేష్ గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, వాసుదేవరావు, షౌకత్ ఆలీ మున్నా, పోశెట్టిగౌడ్, అంజలి, ఆలయ సిబ్బంది, సాయిబాబా భక్తులు, స్థానిక వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి




**వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా: పుట్ల శ్రీనివాస్**

**వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి**

**ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4:00 వరకు ఆరోగ్య సేవలు అందించాలి**

**అన్ని రకాల మందులు, అందుబాటులో ఉంచుకోవాలి**

**వివిధ ఆరోగ్య కార్యక్రమాలు, పథకాలలో ప్రగతిని సాధించి హైదరాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలి**

హైదరాబాద్ జిల్లా బ్యూరో జూన్ 11 సూర్య న్యూస్ :- పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందాలని, ఆ దిశగా వైద్యాధికారులు నిబద్ధతతో పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్టా శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దవఖాన లోని వైద్యుల తో అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ ఆడిటోరియం, ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆసుపత్రులకు వచ్చే వారికి ఓపి సేవలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓపి నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా కార్యాలయం నుండి సమాచారం పంపిస్తే వెంటనే స్పందించాలని, సకాలంలో కార్యక్రమాల నివేదికలు జిల్లా కార్యాలయానికి పంపాలని వైద్యాధికారులకు సూచించారు. అన్ని రకాల మందులు, అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వచ్చే వర్షాకాలం సీజన్ లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు పరిశుభ్రంగా ఉంచాలని అలాగే రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. వైద్యాధికారులు ప్రతిరోజు స్వయంగా ఓపి రోగుల సేవలను చూసి ఓపి రిజిస్టర్ లో స్వయంగా నమోదు చేయాలని సూచించారు. డయాగ్నొస్టిక్ సేవలు అన్ని ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని , అవసరమైన రోగులకు అన్ని రకాల పరీక్షలు చేసి రిపోర్ట్స్ వెంటనే అందించాలని సూచించారు. అత్యవసర రోగులకు ప్రథమ చికిత్స చేసి రిఫర్ చేయాలని , ఏదైనా ప్రమాదానికి గురైన వారికి పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ప్రథమ చికిత్స చేసి రిఫర్ చేయాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టి వ్యాధుల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్త గురించి వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా. శ్రీధర్, డా. సాయిబాబా, డా, శ్రీకళ , సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్, వైద్యాధికారులు, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## హిందూ మహాసముద్రంలో తిమింగలాల శ్మశానం!

చైనా నేతృత్వంలోని అంతర్జాతీయ పరిశోధకులు సముద్ర గర్భంలో ఒక మహాద్భుతాన్ని ఆవిష్కరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత పురాతనమైన తిమింగలాల శ్మశానవాటికను హిందూ మహాసముద్రంలో గుర్తించారు. ఆస్ట్రేలియాకు పశ్చిమాన, దయామాంటినా ఫ్రాక్చర్ జోన్‌లో సుమారు 1,200 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రదేశం విస్తరించి ఉంది. సముద్ర మట్టానికి దాదాపు 7,000 మీటర్ల (23,000 అడుగులు) లోతులో ఈ అద్భుత ప్రపంచం బయటపడింది.

2023లో చైనాకు చెందిన 'ఫెండౌఝే' అనే ప్రత్యేక సబ్‌మెర్సిబుల్ సాయంతో 32 సార్లు సముద్ర గర్భంలోకి వెళ్లి ఈ పరిశోధనలు జరిపారు. ఈ యాత్రలో భాగంగా 485 ప్రదేశాలలో 500కు పైగా తిమింగలాల అస్థిపంజరాలు, శిలాజాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిలో కొన్ని శిలాజాల వయసు 5.3 మిలియన్ సంవత్సరాలు (53 లక్షల ఏళ్లు) ఉంటుందని అంచనా వేశారు. ఇంత పెద్ద స్థాయిలో, ఇంత పురాతనమైన తిమింగలాల శ్మశానం బయటపడటం ఊహించలేదని ప్రధాన పరిశోధకులు జియాటోంగ్ పెంగ్ తెలిపారు. ఈ ప్రాంతంలో కొత్తగా అంతరించిపోయిన తిమింగలం జాతిని (్రవతీశీషివ్‌బం ఌఋఝుత్‌అఋవ) కూడా గుర్తించారు. సముద్రంలో చనిపోయిన తిమింగలాలు అడుగుకు చేరడాన్ని 'వేల్ ఫాల్స్' అంటారు. ఒక్కోసారి ఆహార కొరత ఉండే సముద్ర గర్భంలో ఈ కళేబరాలు పోషకాలతో కూడిన ఒయాసిస్సులా పనిచేస్తాయి.

# బండ్లగూడ జాగీర్ లోని ఎక్సైజ్ అకాడమీలో ఘనంగా దీక్షాంత్ పరేడ్





## అసిస్టెంట్ సూపరింటెండెంట్స్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల దీక్షాంత్ పరేడ్ (పాసింగ్ అవుట్ పరేడ్) ముఖ్య అతిథిగా హాజరైన ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**సిటీ బ్యూరో జూన్ 11 సూర్య న్యూస్ :-** పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు. ఆరు నెలల శిక్షణ పూర్తి చేసిన 117 మంది అధికారులు. వీరిలో 33 మంది మహిళా అధికారులు, 84 మంది పురుష అధికారులు ఉన్నారు. 24 మంది అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, 89 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు పురస్కారాలు అందజేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖలో మహిళల భాగస్వామ్యం పెరగడం మహిళా సాధికారతకు నిదర్శనం అని, పాసింగ్ అవుట్ పరేడ్ ప్రజాసేవకు చేసిన పవిత్ర ప్రతిజ్ఞ, తెలంగాణ అమరుల త్యాగాల ఫలితమే రాష్ట్ర ఆవిర్భావం అని, ఉద్యోగం అభ్యర్థుల కష్టార్జిత విజయంతో పాటు అమరుల త్యాగాల ఫలితం అన్నారు. శిక్షణతో చట్టాలపై అవగాహన, విచారణా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందాయి. అసలు పరీక్ష క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణలోనే మొదలవుతుంది అని, యూనిఫాం హోదాకు కాదు ప్రజల విశ్వాసానికి ప్రతీక అని, ఉద్యోగంతో పాటు సమాజం పట్ల గొప్ప బాధ్యతను అధికారులు స్వీకరిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ కేవలం ఆదాయ శాఖ కాదు ప్రజారోగ్య పరిరక్షణలో కీలక విభాగం అని తెలిపారు. యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడే బాధ్యత అధికారులపై ఉంది డ్రగ్స్, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలి అని, తెలంగాణలోకి మాదకద్రవ్యాలు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి అని, యువత భవిష్యత్తును కంటికి రెప్పలా కాపాడాలి. గంజాయి, మద్యం అక్రమ రవాణా ముఠాలపై కఠిన చర్యలు తప్పవు అని, అక్రమార్కులు ఎంతటివారైనా చట్టం ముందు అందరూ సమానమే అని, నాడు నాటుసారా, గుడుంబా, కల్తీ కల్లు, సింథటిక్ డ్రగ్స్, మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌లు కొత్త ముప్పుగా మారాయి అన్నారు. ఇప్పుడు డ్రగ్స్ నెట్‌వర్క్‌ల వరకు సవాళ్లు మారాయి ఆన్‌లైన్ వేదికల ద్వారా జరుగుతున్న డ్రగ్స్ వ్యాపారంపై ప్రత్యేక నిఘా అవసరం. మారుతున్న నేర ధోరణులకు అనుగుణంగా అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. అప్రమత్తంగా ఉండాలి అని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ ఖురేషీ, అకాడమీ డైరెక్టర్ సురేష్, జాయింట్ కమీషనర్ అంజన్ రావు, జాయింట్ డైరెక్టర్ శశిధర్ రెడ్డి, చీఫ్ డ్రిల్ ఇన్‌స్పెక్టర్ రంగారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, శిక్షణార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# మమత అరాచకాలకు కాంగ్రెస్ అండ !

మామూలు వావాయి చెప్పులు...ముతక చీర..చంకలో సంచీ వేసుకుని సామాన్య స్త్రీలా కనిపించే ఆహార్యంతో ..పదిహేనేళ్లపాటు బెంగాల్‌ను ఏలిని మమతా బెనర్జీ, ఆ రాష్ట్రాన్ని ఎంతమేరకు భ్రష్టు పట్టించాలో అంతగా భ్రష్టు పట్టించారు. ఏం సాధించారంటే ఏమీ లేదు. అధికారం కోసం ఎంతకైనా తెగించడం అలవాటు చేసుకున్నారు. సంసారం పిల్లలు లేరు. అయినా మేనల్లుడిని పెట్టుకుని బెంగాల్‌లో రాజ్యమేలారు. నందిగ్రామ్‌తో రాష్ట్రంలోకి పరిశ్రమలు రాకుండా అడ్డుకుని, ప్రజల్లో మంచి ఇమేజ్ సాధించి..అదే ప్రజలను రాచిరంపాన పెట్టిన రాక్షసిగా పేరుగడించారు. పదిహేనేళ్లుగా అధికార మదంతో తనకు తిరుగులేదనిపించారు. అన్నింటికి మించి భారత భద్రతకు విఘాతం కలిగించారు. పొరుగునే ఉన్న బంగ్లాదేశీయులు యధేచ్ఛగా బెంగాల్లోకి గోడదూకారు. ఇక్కడే తిష్టవేశారు. వారిని ఓటు బ్యాంకుగా మలచుకున్న మమత బెనర్జీ దేశానికి సవాల్ విసిరిన అక్రమ వలసదారుల ఆగడాలను గుర్తించలేదు. తనకు తిరుగులేదని భావించి అనరాచక పాలనకు తెరతీసారు. రేప్‌లు, మర్డర్లు, దోపిడీలు, దొమ్మీలు జరుగుతున్నా.. పట్టించుకోలేదు. సామాన్యులు భయంభయంగా బతికారు. బిజెపి దెబ్బతో ఇప్పుడు దిమ్మతిరిగి నేలమీద పడ్డారు. తన ఉనికికే సవాల్‌గా మారింది. దీంతో కాంగ్రెస్‌తో కాళ్బేరానికి వచ్చారు. అందుకే మమతాబెనర్జీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. టీఎంసీ సీనియర్ నేత సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన 3 రోజులకే మరో ఎంపీ సుష్మితా దేవ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం ఆమె అస్సాం సీఎం హిమంత శర్మతో సమావేశమయ్యారు. త్వరలో ఆమె బీజేపీలో చేరతారని సమాచారం. అస్సాంకు చెందిన సుష్మితా దేవ్ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి సంతోష్ మోహన్ దేవ్ కుమార్తె. గతంలో ఆమె అస్సాంలోని సిల్చార్ నుంచి గెలుపొందారు. ఇకపై అస్సాంలోనే రాజకీయాలు చేస్తానని, బెంగాల్‌లో కాదని ఆమె స్పష్టం చేశారు. తాజాగా ప్రకాశ్ చిక్ బరైక్ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో అక్కడ దాదాపు టిఎంసి ఖాళీ అవుతోంది. నిజానికి ప్రాంతీయ పార్టీలు ఇంతగా దెబ్బతిన్న దాఖాలు ఏ రాష్ట్రం లోనూ లేవు. మమత మీద విశ్వాసం లేదంటే ఆమె ఎంతగా నియంతలా వ్యవహరించారో తెలిసిపోతోంది. ఇప్పటికే అసెంబ్లీలో ఎమ్మెల్యేలు వేరుకుంపటి పెట్టుకున్నారు. టీఎంసీకి చెందిన 19 మంది ఎంపీలు తిరుగుబాటు చేసి వేరుకుంపటి పెట్టుకున్నారు. ఈ బృందానికి టీఎంసీ సీనియర్ ఎంపీ కాకోలీ ఘోష్ నేతృత్వం వహిస్తున్నారు. దీదీకి అత్యంత విధేయంగా ఉన్న శత్రుఘ్న సిన్హా, యూసుఫ్ పఠాన్, సయాని ఘోష్ కూడా తిరుగుబాటు బృందంతో చేతులు కలిపారు. జగదీశ్ చంద్ర మసునియా, ఖలి ఉర్ రహమాన్, అబు తాహిర్ ఖాన్, పార్థ భౌమిక్, బాపి హల్దార్, మాలా రాయ్, మితాలీ బాగ్, దీపక్ అధికారి, కాలీపాద సోరేన్, జూన్ మాలియా, అరూప్ చక్రవర్తి, షర్మిలా సర్కార్, అసిత్ కుమార్, శతాబ్ది రాయ్, రచనా బెనర్జీ కూడా తిరుగుబాటుదారుల బృందంలో ఉన్నారు. టీఎంసీకి లోక్‌సభలో 28 మంది సభ్యులుండగా 19 మంది రెబల్స్‌గా ప్రకటించుకున్నారు. మరోవైపు పశ్చిమబెంగాల్ శాసనసభకు ఇటీవల ఎన్నికైన 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేల్లో 64 మంది తిరుగుబాటు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఎమ్మెల్యేలు, ఎంపీల్లో చీలికలు, నేతల రాజీనామాల నేపథ్యంలో ఆ పార్టీని జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయాలని కాంగ్రెస్ పార్టీ నేత సోనియాగాంధీ ప్రతిపాదించినట్లు సమాచారం. మమతను దారికి తెచ్చుకోవడానికి, బెంగాల్లో కాలు మోపడానికి కాంగ్రెస్‌కు ఇదొక్కటే అవకాశం. అయితే ఈ ప్రతిపాదనపై స్పందించేందుకు కొంత సమయం కావాలని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కోరినట్లు సమాచారం. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ అధికారం కోల్పోయి, బీజేపీ పాలన ప్రారంభమైన దరిమిలా.. టీఎంసీలో అంతర్గత కుమ్ములాటలు ప్రారంభమయ్యాయి. మరోవైపు బీజేపీ నుంచి ఒత్తిళ్లు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ ఒత్తిళ్ల నుంచి బయటపడేందుకు టీఎంసీని కాంగ్రెస్‌లో విలీనం చేయడమే పరిష్కారమని సోనియా సూచించినట్లు తెలిసింది. మరోవైపు, అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ నేత రాహుల్‌తో భేటీ అయ్యారు. టీఎంసీ అగ్రనేతలుగా ఉన్న వారు పార్టీపై తిరుగుబాటు జెండా ఎగరేయడంతో పాటు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతిస్తామని ప్రకటించారు. దీంతో పార్టీ భవితవ్యంపై మమత తల్లడిల్లుతున్నారు. భవిష్యత్తులో వచ్చే ఎన్నికల్లో ఏవిధంగా ముందుకు సాగాలన్నది మరింత ఇబ్బందికరంగా మారింది. 64 మంది ఎమ్మెల్యేలు.. రితబ్రత బెనర్జీ నేతృత్వంలో చీలిపోగా, 28 మంది ఎంపీల్లో 20 మంది కకోలీ ఘోష్ దస్తీదార్ నేతృత్వంలో విడిపోయి.. ఎన్డీయేకు మద్దతిస్తామని, తమను ప్రత్యేక సమూహంగా గుర్తించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖరాశారు. ఈ పరిణామాలతో టీఎంసీ పార్టీ మమత చేతుల్లోంచి జారిపోయే ప్రమాదం ఏర్పడింది. చీలిక వర్గాలకు 'గుర్తింపు' లభిస్తే.. పార్టీ గుర్తు, జెండా సహా టీఎంసీ ఆస్తులపైనా హక్కులు లభించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ ఢిల్లీలో సోనియాగాంధీని కలుసుకుని సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అనంతరం బుధవారం కూడా మరోసారి ఇరువురు భేటీ అయ్యారు. ఈ సందర్భంగానే సోనియాగాంధీ.. విలీన ప్రతిపాదనను మమత ముందు ఉంచారని టీఎంసీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్‌లో విలీనం చేయడం ద్వారా బలమైన ప్రతిపక్షంగా బీజేపీని ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుందని ఆమె సూచించారని పేర్కొన్నాయి. టీఎంసీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తే, మమతా బెనర్జీకి కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షురాలి పదవితోపాటు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి ప్రధాన కార్యదర్శి పదవులు ఇస్తామని సోనియాగాంధీ హామీ ఇచ్చినట్టు తెలిపాయి. ఈ ప్రతిపాదనపై తక్షణమే నిర్ణయం తీసుకోలేనని, కొన్ని రోజుల సమయం కావాలని మమత కోరినట్టు టీఎంసీ వర్గాలు వెల్లడించాయి.టీఎంసీ విలీన ప్రతిపాదన వార్తలపై బెంగాల్ కాంగ్రెస్ విభాగం సీనియర్ నాయకులు తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. అక్రమార్కులు, అన్యాయాలు చేసిన పార్టీని కాంగ్రెస్‌లో ఎలా కలుపుకొంటారని నిలదీస్తున్నారు. అధికారికంగా దీనిపై ప్రకటన వచ్చాక తమ నిర్ణయం వెల్లడిస్తామని కొందరు నేతలు తెలిపారు. దీంతో కాంగ్రెస్‌కు కూడా చిక్కులు తప్పేలా లేవు. గతంలో కాంగ్రెస్ పార్టీతోనే రాజకీయాల్లోకి ప్రవేశించిన మమత.. 28 ఏళ్ల కిందట 1998లో కాంగ్రెసతో విభేదించి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. వరుసగా మూడు సార్లు బెంగాల్ ఎన్నికల్లో విజయం దక్కించుకుని అధికారంలోకి వచ్చారు.అయితే ఆమె పార్టీని కూడా సరిగా నడపలేరని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఎన్నో అక్రమాలు చేఇవుంటే తప్ప ఇప్పుడు బిజెపికి భయపడాల్సిన అవసరం లేదు. కానీ అరాచక పాలన సాగించిన పాపానికి ఆమెకు భవిష్యత్ ఉంటుందా అన్నది అనుమానమే.

## ఓపెన్ కిచెన్ల శకం ముగిసిందా? 2026 వంటగది కొత్త ట్రెండ్స్ ఇవే!

అమెరికా వంటి దేశాల్లో ఇంటి యజమానులు ఇప్పుడు కొత్త ఇల్లు కొనడం కంటే ఉన్న ఇంటిని, ముఖ్యంగా వంటగదిని అందంగా మార్చుకోవడంపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఆకాశాన్నంటుతున్న ఇళ్ల ధరలు, మార్కెట్లో ఇళ్ల కొరత కారణంగా ఈ ధోరణి పెరిగింది. థంబ్‌టాక్ అనే సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే 2026లో కిచెన్ రెనోవేషన్లు ఏకంగా 67 శాతం పెరిగాయి.ఇంటిని మార్చలేని పరిస్థితుల్లో, చాలామంది తమ వద్ద ఉన్న డబ్బుతో కిచెన్లను ఆధునికంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దుకుంటున్నారు. స్టోరేజీ సరిపోకపోవడం (47 శాతం), వంటగది లేఅవుట్ బాగోకపోవడం (36 శాతం) వంటి సమస్యలను అధిగమించేందుకు ఈ రెనోవేషన్లు చేస్తున్నారు.

**మారిన అభిరుచులు, కొత్త ట్రెండ్స్:** ఒకప్పుడు బాగా ప్రాచుర్యం పొందిన పూర్తిగా ఓపెన్ కిచెన్ల స్థానంలో ఇప్పుడు సెమీ-ఓపెన్ డిజైన్లకు డిమాండ్ పెరుగుతోంది. ఇంట్లో శబ్దాలు రావడం, వంటగది చిందరవందరగా కనిపించడం వంటి కారణాలతో చాలామంది ఈ కొత్త శైలిని ఇష్టపడుతున్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సోషల్ మీడియా,

వీడియో కాల్స్‌లో తమ కిచెన్ అందంగా కనిపించాలని చాలామంది కోరుకుంటున్నారు. దీనికోసం ప్రత్యేక లైటింగ్, ఆకర్షణీయమైన టైల్స్, గోడలకు వాల్‌పేపర్లు వాడుతున్నారు. తమకు ఆనందం కలిగించే రంగులు, డిజైన్లను ఎంచుకోవడం ("జాయ్‌డ్రెంచింగ్") ఈ ఏడాది ప్రధాన ట్రెండ్‌గా నిలిచింది. వీటితో పాటు స్మార్ట్ టెక్నాలజీ వాడకం కూడా పెరిగింది. వాయిస్ కమాండ్‌తో పనిచేసే ఓవెన్లు, యాప్‌తో నియంత్రించే రిఫ్రిజిరేటర్లు, కాఫీ మేకర్ల వంటివి వంటగదిలో భాగమవుతున్నాయి.

# రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి జూన్ 11 సూర్య న్యూస్ :-** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటినప్పటికీ కూడా ఇప్పటివరకు రాష్ట్రంలో ఉన్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోవడం విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యా వ్యవస్థ పై చర్చలు జరపకపోవడం ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టకపోవడం ఇది పూర్తిగా విద్యార్థులకు అన్యాయం చేయడమే అవుతుంది అని యు ఎస్ ఎఫ్ ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రకాంత్ అన్నారు ఆయన పత్రికా ప్రకటన ద్వారా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ కళాశాలలో ప్రభుత్వ హాస్టల్లో ఎన్నో సమస్యలతో ఆ ప్రభుత్వ విద్యాసంస్థలు ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కోసం ఎదురుచూపులు చూస్తుందన్నారు ఈ నెలలో విద్యాసంస్థలు మొదలు కాబోతున్నాయి ఇప్పటివరకు కూడా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం చాలా బాధాకరమని, చెప్పి పత్రికా ప్రకటన ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ విద్యార్థుల సమస్యల కోసం చర్చలు జరిపేందుకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. రోజు రోజుకు రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల బ్రాంచీలు ఎక్కువైపోతున్నాయని పేద విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు లక్షల రూపాయల్లో డబ్బులు వసూలు చేస్తూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు చెలరేగిపోతున్నాయి కావున వెంటనే రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నియమించి ఒక పటిష్టమైన నిర్ణయం తీసుకొని ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడాలని కోరుతున్నామని తెలిపారు.

# నామినేషన్ తిరస్కరణ వ్యవహారం

## సుప్రం కోర్టులో మీనాక్ష నటరాజన్ పిటిషన్

## నేడు విచారణ చేస్తామని చెప్పిన సుప్రీం

మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ రాజ్యసభకు దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురైన క్రమంలో.. ఈ అంశంపై తక్షణమే విచారణ చేపట్టాలని మీనాక్షి గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. మీనాక్షీ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదిస్తున్నారు. తప్పుడు రీతిలో మీనాక్షి నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఆయన కోర్టుకు తెలిపారు. కానీ రాజ్యసభ ఎన్నిక పక్రియ ముగిసిన తర్వాతే ఎలక్షన్ పిటీషన్ నమోదు చేయాలని మీనాక్షికి సుప్రీంకోర్టు చెప్పినట్లు తెలుస్తోంది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణకు ఆమోదించింది. మధ్యప్రదేశ్‌లో మూడు రాజ్యసభ సీట్ల కోసం జూన్ 18వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అయితే మంగళవారం అనూహ్య పరిణామం చోటుచేసుకున్నది. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అరవింద్ శర్మ అకస్మాత్తుగా మీనాక్షీ నటరాజన్ పిటీషన్‌ను తిరస్కరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి జలక్ తగిలింది. మీనాక్షి అసంపూర్ణంగా డాక్యుమెంట్లు సమర్పించినట్లు అరవింద్ శర్మ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. తనపై కోర్టు కేసు ఉన్న విషయాన్ని ఆమె ఫామ్ 26లో పొందుపరచలేదని ఆర్వో తెలిపారు.2025 అక్టోబర్‌లో హైదరాబాద్ కోర్టుకు నోటీసుకు నటరాజన్ స్పందించారని, కానీ ఫామ్ 26లో ఈ విషయాన్ని చెప్పలేదని రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు. తెలంగాణలో మీనాక్షీపై కేసు నమోదు అయ్యిందని బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జూన్ 8వ తేదీన నామినేషన్ ఫైలింగ్‌కు చివరి తేది. మంగళవారం రోజున ఆ పేపర్లను స్క్రూటినీ చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నాటరాజన్ తన నామినేషన్‌ను తిరస్కరించినందుకు సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని ఆమె కోర్టును కోరారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ జరపనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రాజ్యసభ ఎన్నికలు జూన్ 18న జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ జూన్ 9వ తేదీన నామినేషన్ దాఖలు చేశారు. మీనాక్షి నటరాజన్ ప్రస్తుతం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) నుంచి తెలంగాణ ఇన్‌ఛార్జీగా ఉన్నారు.

# ఒమన్ తీరంలో భారతీయ నౌకపై దాడి ఘటన

## కాల్పుల్లో ముగ్గురు నావికుల మృతి: ధృవీకరించిన మంత్రి

ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న సెటెబె వాణిజ్య నౌకపై అమెరికా జరిపిన దాడి కలకలం సృష్టించింది. దాడి సమయంలో నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది ఉండగా.. వారిలో ముగ్గురు నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని షిప్పింగ్ మినిస్టర్ సర్బానంద సోనోవాల్ ధ్రువీకరించారు. ఇది విషాదకరమైన ఘటన అని, ఆ ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మృతులను డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్‌గా గుర్తించారు. సురేశ్ తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ నుంచి చమురు రవాణా చేసేందుకు ప్రయత్నించినందుకే ట్యాంకర్‌పై కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్యపై ఆగ్రహం వ్యక్తంజేసింది. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపేయాలని... అంతర్జాతీయ జలమార్గాల్లో రవాణా స్వేచ్ఛగా జరగాలని పేర్కొంది. అంతేగాకుండా దిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మిక్స్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది. 24 మంది భారతీయులున్న మరో నౌకపై ఒమన్ తీరంలో అమెరికా నౌకాదళం మూడు రోజుల కిందట దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై తాజాగా దాడి జరిగింది. ఒమన్ తీరంలో ఆ నౌకపై అమెరికా మిలిటరీ దాడి చేసింది. వారంరోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తాజా ఘటనను ఒమన్‌లోని భారత ఎంబసీ వెల్లడించింది. ఈ రోజు ఉదయం ఒమన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో నౌకపై దాడి జరిగింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం అని పేర్కొంది. ఈ నౌక పేరు జలవిహార్‌గా తెలుస్తోంది.

# సంక్షోభంలో తృణమూల్ కాంగ్రెస్

## రాజ్యసభకు ఎంపి రాజీనామా ప్రకటన

## పార్టీని వీడిన ప్రకాశ్ చిక్ బరైక్

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. సీనియర్ నేతలు పార్టీని వీడుతున్నారు. రాజీనామాల పరంపర కొనసాగుతోంది. మూడు రోజుల క్రితం సీనియర్ నేత సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. నిన్న

మరో ఎంపీ సుష్మితా దేవ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆమె బీజేపీలో చేరతారన్న ప్రచారం జరుగుతోంది. గురువారం ప్రకాశ్ చిక్ బరైక్ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రకాశ్ రాజీనామాతో రాజ్యసభలో టీఎంసీ ఎంపీల బలం 10కి పడిపోయింది. అయితే, ఇది ఆరంభం మాత్రమేనని, వచ్చే వారం మరి కొంతమంది ఎంపీలు కూడా రాజీనామా చేసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మమతా బెనర్జీకి నమ్మిన బంటుగా ఉన్న సుఖేందు శేఖర్ రాయ్ పార్టీని వీడటంతో సంక్షోభం మొదలైంది. టీఎంసీకి చెందిన 19 మంది ఎంపీలు తిరుగుబాటు చేసి వేరుకుంపటి పెట్టుకున్నారు. ఈ బృందానికి టీఎంసీ సీనియర్ ఎంపీ కాకోలీ ఘోష్ నేతృత్వం వహిస్తున్నారు.దీదీకి అత్యంత విధేయంగా ఉన్న శత్రుఘ్న సిన్హా, యూసుఫ్ పఠాన్, సయాని ఘోష్ కూడా తిరుగుబాటు బృందంతో చేతులు కలిపారు. దాదాపు 64 మంది ఎమ్మెల్యేలు రెబల్స్‌గా మారారు. సంక్షోభం కారణంగా మమతా బెనర్జీ దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

# సిరుల పంట



యాసంగిలో రైతులు అంచనాలకు అనుగుణంగా దిగుబడులు సాధించారు. జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు వచ్చాయి. ఐదు కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యం కొంటున్నారు. ఆయా గ్రామాల ధాన్యం పూర్తికాగానే కొనుగోలు కేంద్రాలను మూసివేస్తారు. ఈ యాసంగి సీజన్‌లో 2.6 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 6.5 లక్షల టన్నుల నుంచి ఏడు లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అందులో విత్తనపు పంట, రైతుల సొంత అవసరాలకు మినహాయించుకునే ధాన్యం పోను 3.67 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వస్తారని, సుమారు లక్ష టన్నుల ధాన్యం ప్రైవేట్‌లో విక్రయిస్తారని భావించారు. ధాన్యం కొనుగోలు కోసం ఐకేపీ సంస్థ ద్వారా 91, ప్రాథమిక వ్యసాయ సహకార సంఘాల ద్వారా 178, డీసీఎంఎస్ ద్వారా 39, హాకా ద్వారా 9 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 317 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా 312 కేంద్రాలను ఇప్పటికే మూసివేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు చెందిన నాలుగు, డీసీఎంఎస్‌కు చెందిన ఒక కేంద్రంలో కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఒకటిరెండు రోజుల్లో ధాన్యం అమ్మకాలు పూర్తవుతాయని భావిస్తున్నారు.

**అంచనాలకు అనుగుణంగా..** ఇప్పటి వరకు జిల్లాలో 52,372 మంది రైతులకు చెందిన 822.22 కోట్ల రూపాయల విలువ చేసే 3,46,603 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 47,504 మంది రైతులకు చెందిన 3,13,537 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన 746.25 కోట్ల రూపాయలు సివిల్ సప్లయిస్ శాఖ చెల్లించింది. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి 75.97 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉన్నది. ఇప్పటికి తెరిచి ఉన్న కొనుగోలు కేంద్రాలు మూసివేసే వరకు 3.5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అధికారులు అంచనా వేసినట్లుగానే కొనుగోళ్లు జరిగాయి. 3.67 లక్షల టన్నుల అంచనాకు గాను 3.50 లక్షల టన్నుల కొనుగోళ్ళు జరుగుతాయని భావిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను కొంత ఆలస్యంగా ప్రారంభించినా అకాల వర్షాలు ఎక్కువగా పడకపోవడం, రుతుపవనాలు ఆలస్యం కావడంతో రైతులు ఎక్కువగా నష్టపోకుండా కొనుగోళ్లు పూర్తవుతున్నాయని సంతోసిస్తున్నారు.

**అందని సన్న వరి బోనస్ :** ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 5,574 మెట్రిక్ టన్నుల సన్న రకం వరిధాన్యం కొనుగోలు చేశారు. క్వింటాల్‌కు 500 రూపాయల చొప్పున బోనస్ చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. రైతులు అమ్మిన సన్న వరి ధాన్యానికి 2.79 కోట్ల రూపాయలు బోనస్ ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. ధాన్యం కొనుగోళ్లు పూర్తయి బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమకాలేదు.

**మక్కల కొనుగోళ్లు పూర్తి** యాసంగిలో జిల్లాలో 32,300 పైచిలుకు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఈసారి ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల చొప్పున భారీగా దిగుబడి వచ్చింది. తొమ్మిది లక్షల క్వింటాళ్ల మేరకు దిగుబడి వచ్చినా ఎకరాకు 26 క్వింటాళ్లే కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది. జిల్లాలో ఏడు కొనుగోలు కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేసింది. కొనుగోళ్లలో జాప్యం జరగడంతో రైతులు ప్రైవేట్‌లోనే 1800 రూపాయలకు క్వింటాల్ చొప్పున విక్రయించారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు 2,400 రూపాయలు ఉన్నా కొనుగోలు చేసే వారు లేక కేంద్రాల్లో పడిగాపులు కాయడం కంటే ప్రైవేట్‌లో అమ్ముకోవడం మేలనుకున్న రైతులు తక్కువ ధరకే అమ్మేశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చొప్పదండి, జమ్మికుంట, గన్నేరువరం, మల్లాపూర్, చిగురుమామిడి, సైదాపూర్, కరీంనగర్ కొనుగోలుకేంద్రాల్లో 2,79,384 క్వింటాళ్ల మక్క జొన్నలను కొనుగోలు చేశారు. వీటికి మాత్రమే కేంద్రం ప్రకటించిన మద్దతు ధర లభించగా మిగతా రెండు వంతుల మక్కలను రైతులు ప్రైవేటులోనే అమ్ముకోవలసి వచ్చింది.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో గడిచిన యాసంగి సీజన్ రైతులకు లాభాల పంటగా మారడమే కాకుండా, ధాన్యం కొనుగోళ్లలోనూ కొత్త రికార్డులను నమోదు చేసింది. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో జిల్లాలో కొనుగోళ్లు గడిచిన ఐదేళ్ల సీజన్ల కంటే ఈ సీజన్‌లో కొనుగోళు అధిగమించడం విశేషం. గడిచిన యాసంగి సీజన్‌లో 1,92,329 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఈ పంటను కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 334 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. గురువారం ధాన్యం కొనుగోళ్లు ముగిసే నాటికి 1031 కోట్ల 85 లక్షల రూపాయల విలువైన 4,35,502.68 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 59,342 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇందులో ఏ గ్రేడ్ ధాన్యం 7,437.96 మెట్రిక్ టన్నులు, కామన్ గ్రేడ్ ధాన్యం 4,28,064.72 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. గత యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈసారి 34,390 మెట్రిక్ టన్నుల మేర అదనంగా ధాన్యం సేక రించడం విశేషం. అనుకూల వాతావరణ పరిస్థితులు, సమృద్ధిగా సాగునీరు అందుబాటులో ఉండటం, రైతులు మెరుగైన సాగు పద్ధతులు పాటించడం వల్ల దిగుబ డులు పెరిగాయి. ఫలితంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వెల్లువలా చేరింది. జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి నేరుగా ధాన్యాన్ని సేకరించారు. దీంతో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు గిట్టుబాటు ధర పొందగలిగారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడంతో పాటు, సకాలంలో చెల్లింపులు జరిపేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీఎస్ఓ శ్రీనాథ్, పౌరసరఫరాల సంస్థ డీఎం ముప్పిడి శ్రీకాంత్ రెడ్డి, డీసీఓ శ్రీమాల, డీఆర్‌డీఓ కాళిందిని, తదితరులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, ఎమ్మెల్యే రాజ్‌ఠా కూర్ మక్కాన్‌సింగ్ ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించి అధికారులను పురమాయించారు. కొను గోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపుల్లోనూ రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో నిలుస్తోంది. ఇప్పటి వరకు రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో 93 శాతం 958 కోట్ల 31 లక్షల రూపాయలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన చెల్లింపులను కూడా త్వరలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుం టున్నారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు, వేగవం తమైన చెల్లింపులతో రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. యాసంగి సీజన్‌లో సాధించిన ఈ విజయంతో వ్యవ సాయ రంగంలో జిల్లా మరో మైలురాయిని చేరుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

**తీపి జ్ఞాపకాలను మిగల్చిన యాసంగి..**

జిల్లా రైతాంగానికి గడిచిన యాసంగి సీజన్ తీపి జ్ఞాపకాలను మిగిల్చింది. ప్రకృతి పూర్తిగా సహకరించ డంతోపాటు సాగునీటి లభ్యత, రైతుల శ్రమ కలిసి వచ్చి జిల్లాలో వరి పంట రికార్డు స్థాయిలో దిగుబడిని చ్చింది. గతంలో ఎన్నడూ లేనంతగా ధాన్యం ఉత్పత్తి కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యాసంగి ప్రారంభం నుంచి కోతల వరకు వాతావరణం అనుకూలంగా ఉండటం రైతులకు కలిసి వచ్చింది. కీలక దశల్లో వర్షాలు, ఉష్ణోగ్రతలు పంటకు అనుకూలంగా మారడంతో వరి ఏపుగా పెరిగింది. తెగుళ్లు, చీడపీడల ప్రభావం కూడా తక్కువగా ఉండటంతో దిగుబడులు గణనీయంగా పెరిగాయి. ఫలితంగా జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఎకరాకు ఆశించిన దానికంటే అధికంగా ధాన్యం చేతికొచ్చింది. ఎకరానికి 30 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. జిల్లాలో సాగు చేసిన పంటలో విత్తనోత్పత్తి కోసం 20 వేల ఎకరాలకు పైగా సాగు చేయగా, ఆ పంటను అంతా ఆయా విత్తన కంపెనీలు రైతుల నుంచి కొనుగోలు చేశాయి. మిగతా

పంట మొత్తం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది.గడిచిన ఐదేళ్లలో వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం కొనుగోళ్లు..

# వరి సాగుకు సర్కారు కళ్లెం

### 8 రకాలకే రూ.500 బోనస్ పరిమితం

వరి సాగుకు కళ్లెం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రతి సీజన్‌లో సగటున 60 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుండగా... ఈసారి కనీసం 10 శాతం(6 లక్షల ఎకరాలు) తగ్గించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉంది. బోనస్ పథకం వర్తింపును 33 రకాల నుంచి 8 రకాలకు తగ్గించింది. ఆ మేరకు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేందుకు వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తోంది. పప్పు ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు, చిరుధాన్యాల సాగును పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా పలు వేదికలపై పంటల మార్పిడి ఆవశ్యకత గురించి వివరిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో వరి సాగును తగ్గించాలని, ఇతర పంటలను సాగుచేయాలని సూచిస్తున్నారు. నీటి వినియోగం, సాగు ఖర్చులు తగ్గుతాయని, కరువును తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని, నేల మరింత సారవంతమవుతుందని, రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని వ్యవసాయశాఖ చెబుతోంది. కందులు, పెసర్లు, మినుముల లాంటి పప్పు ధాన్యాలు, నువ్వులు, వేరుశనగ, పొద్దుతిరుగుడులాంటి నూనె గింజలు, టమాట, మిర్చి, వంగ, బెండ లాంటి కూరగాయల సాగు చేపట్టాలని సూచిస్తోంది.



దీర్ఘకాలిక పంటగా పామాయుల్ సాగుపై ప్రచారం చేస్తోంది. 'ఎల్‌నినో' ప్రభావాన్ని ఎదుర్కోవటానికి రైతులు సిద్ధంగా ఉండాలని, ఆలస్యపు, అరకొర వర్షాలు వస్తే... ఆరుతడి పంటలు సాగుచేయటమే మేలని సూచిస్తోంది.

# స్ట్రీట్ ఫుడ్ హబ్‌గా భద్రకాళి బండ్

వరంగల్ నగరంలో అందాల పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతున్న భద్రకాళి బండ్ సరికొత్త ఆహార రుచులకు వేదికగా నిలువబోతోంది. బండ్ ప్రాంతంలో 'జీవెల్ ఫుడ్ స్ట్రీట్ హబ్' ఏర్పాటుకు సర్వం సిద్ధమైంది. వరంగల్ జిల్లాకు పర్యాటక ప్రాంతంగా ప్రపంచ గుర్తింపు కలిగి ఉండడం, వారసత్వ నగరం కావడంతో కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రతిష్మాత్మక ప్రాజెక్ట్‌కు ఎంపిక చేసింది.రాష్ట్రంలో హైదరాబాద్‌లోని సైబరాబాద్, ఖమ్మం, వేములవాడ, ధర్మపురితోపాటు వరంగల్ నగరం జీవెల్ స్ట్రీట్ ఫుడ్ హబ్‌కు ఎంపిక కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. మంగళవారం ఢిల్లీ నుంచి కేంద్ర ప్రభుత్వ గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉషాకిరణ్ గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ, మెప్మా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి సంతోషం వ్యక్తం చేశారు. జీవెల్ స్ట్రీట్ ఫుడ్ హబ్‌కు సంబంధించిన డీపీఆర్‌లను ఇంజనీరింగ్ అధికారులు రూపొందించి కేంద్రానికి పంపించినట్లు తెలిపారు.

**నోరూరించే రుచులు** భద్రకాళి ఆలయ పరిసరాలు, లేక్ వ్యూ బండ్ ఇప్ప టికే వరంగల్ నగర వాసులకు ఈవినింగ్ స్పాట్‌గా మారింది. సాయంత్రం ఇక్కడికి వచ్చే వేలాది మంది సందర్శకులను ఆకట్టుకునేలా ఒకే చోట్ల అన్ని రకాల ఆహార పదార్థాలు లభించేలా స్ట్రీట్ ఫుడ్ హబ్‌ను డిజైన్ చేస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాలకు అనుకూలంగా పరి శుభ్రమైన వాతావరణంలో ఈ స్ట్రీట్ ఫుడ్ హబ్‌ను నిర్వహించనున్నారు. కాగా, హంటర్‌రోడ్డు మార్గంలో ఉన్న బండ్ ప్రధాన ద్వారం ఎదుట ఏర్పాటుచేసే హబ్‌లో తెలంగాణ సంప్రదాయ వంటకాలతో పాటు బిర్యాని, సర్వపిండి, జొన్నరొట్టెలు, పిండి పంటకాలు, ఫాస్ట్‌ఫుడ్, ఐస్‌క్రీం, మాక్‌టైల్స్, సౌత్, నార్త్ వంటకాలు, సీజనల్ పండ్ల రసాల జ్యూస్‌లను ఇక్కడే తయారు చేసి స్టాల్స్‌ను నుంచి విక్రయాలు జరుపుతారు. బండ్ అందాలను వీక్షిస్తూ ఫుడ్ ఎంజాయ్ చేసేలా ప్రత్యేక ఓపెన్ ఎయిర్‌సిట్టింగ్‌ను ఏర్పాటు చేసేందుకు డీపీఆర్ రూపకల్పన చేశారు. అయితే వేయిస్తంభాలగుడి, వరంగల్ కోట, భద్రకాళి దేవాలయం, పద్మాక్షి టెంపుల్, రామప్ప, లక్నవరం ప్రాంతాలకు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చేవారికి ఇక్కడి స్ట్రీట్ ఫుడ్ రుచులు, పరిసరాలు మానసిక ఆనందాన్ని కలిగిస్తాయి. జీవెల్ స్ట్రీట్ ఫుడ్ హబ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి నుంచి ఇప్పటికే రూ.4కోట్ల నిధులు మంజూరు చేసింది. మొత్తం ప్రాజెక్ట్ ఖర్చు రూ. 4కోట్లు కాగా, రూ.2.80 కోట్లు క్యాపిటల్ కాస్ట్, రూ.10 లక్షలు డిజైన్ ఫీజు, రూ. 80 లక్షలు ఆపరేషనల్ మేనేజ్‌మెంట్ ఖర్చులు, ప్రత్యేకలైటింగ్, గ్రీనరీ, పార్కిం గ్, టాయిలెట్స్, పిల్లల ఆట వస్తువులు కలుపుకుని అభివృద్ధి చేస్తారు. ఇంకా అవసరం ఉంటే జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక నిధుల నుంచి ఖర్చు చేస్తారు.

# సంకల్పం మంచిదే... అమలే సవాలు!

ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను హేతుబద్ధీకరించి, తక్కువ విద్యార్థులున్న వేలాది పాఠశాలల స్థానంలో సమగ్ర 'క్లస్టర్ పాఠశాలలు' ఏర్పాటు చేయాలనే తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదన విద్యావేత్తలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల మధ్య విస్తృత చర్చకు దారితీసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పం ప్రశంసనీయం.ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండటంతో అన్ని సబ్జెక్టులకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించడం సాధ్యం కావడం లేదని ప్రభుత్వం పేర్కొంటోంది. కేవలం కొద్దిమంది విద్యార్థుల కోసం వేలాది పాఠశాలలను నిర్వహించడం ప్రజాధనాన్ని సమర్థవంతంగా వినియోగించడం కాదని వాదిస్తోంది. అందువల్ల వాటిని విలీనం చేసి, నర్సరీ నుంచి ఇంటర్ వరకు బోధన, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, డిజిటల్ విద్యా వనరులు, క్రీడా సదుపాయాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత రవాణా వంటి సౌకర్యాలతో కూడిన క్లస్టర్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. విద్యాపరంగా చూస్తే ఈ ప్రతిపాదనకు కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. పెద్ద పాఠశాలల్లో గణితం, విజ్ఞానం, ఆంగ్లం, సామాజికశాస్త్రం వంటి ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు పరస్పర పోటీ, సమూహ అధ్యయనం, క్రీడలు, ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు పెరుగుతాయి. అలాగే ప్రభుత్వ నిధులను విభజించి చిన్న చిన్న పాఠశాలలపై ఖర్చు చేయడం కంటే, కొద్ది పాఠశాలలను ఉన్నత ప్రమాణాలతో అభివృద్ధి చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. అయితే ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల అందుబాటు అత్యంత కీలకం. ప్రస్తుతం అనేక మంది పిల్లలు తమ గ్రామంలోనే లేదా నడిచి వెళ్లగలిగే దూరంలో ఉన్న పాఠశాలల్లో చదువుతున్నారు. ఈ పాఠశాలలను విలీనం చేస్తే, వారు ప్రతిరోజూ అనేక కిలోమీటర్లు ప్రయాణించి క్లస్టర్ పాఠశాలలకు వెళ్లాల్సి వస్తుంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఇది పెద్ద భారం. ప్రభుత్వం ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తామని ప్రకటించింది. అయితే సమగ్ర ప్రణాళిక, తగిన నిధుల కేటాయింపు, సమర్థవంతమైన పరిపాలనపై దాని విజయం ఆధారపడి ఉంటుంది. బస్సుల కొరత, రోడ్ల సమస్యలు లేదా నిర్వహణలో లోపాలు ఏర్పడితే పిల్లల హాజరు ప్రభావితమవుతుంది. ఆరు లేదా ఏడు సంవత్సరాల వయస్సు గల పిల్లలు ప్రతిరోజూ ఎక్కువ దూరం ప్రయాణిస్తే అలసిపోతారు. చదువుకు తక్కువ సమయం,ఆటపాటల కొరత వంటి సమస్యలు తలెత్తవచ్చు. చిన్న పిల్లలను దూర ప్రాంతాలకు పంపడానికి తల్లిదండ్రులు కూడా సంకోచించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో యుక్తవయసు బాలికలు ఎక్కువ దూరం ప్రయాణించడం పట్ల అనేక కుటుంబాల్లో ఇప్పటికీ ఆందోళనలున్నాయి. భద్రత, రవాణా, సమయపాలన వంటి అంశాల కారణంగా వారు చదువును మధ్యలోనే నిలిపివేసే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పేద, అట్టడుగు వర్గాల పిల్లలపై ఇది ప్రభావం చూపుతుంది. పాఠశాలల విలీనంతో ఉపాధ్యాయుల బదిలీలు పెరగడం, గ్రామాలతో ఏర్పడిన అనుబంధం దెబ్బతినడం, పెద్ద పాఠశాలల్లో పని భారం అధికమయ్యే అవకాశం ఉంటుంది. తగిన ఆర్థిక వనరులు కేటాయించకుండా, రవాణా వ్యవస్థను బలోపేతం చేయకుండా, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా పాఠశాలల విలీనాన్ని తొందరపడి అమలు చేస్తే గ్రామీణ పిల్లలకు ప్రతికూల ప్రభావం కలుగుతుంది. పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఇది విద్యాభ్యాసంలో పెద్ద ఆటంకం. ప్రతి గ్రామానికి సమీపంలో ప్రాథమిక పాఠశాలలు కొనసాగిస్తూ, ఉన్నత తరగతుల కోసం మాత్రమే క్లస్టర్ పాఠశాలలను అభివృద్ధి చేయడం ఒక ఉత్తమ ప్రత్యామ్నాయం. దీని అమలుకు ముందు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలతో విస్తృతంగా సంప్రదింపులు జరపాలి. అమలు అనంతరం విద్యార్థుల నమోదు, హాజరు, చదువు మానివేత శాతం వంటి అంశాలను నిరంతరం పరిశీలించి అవసరమైన మార్పులు చేయాలి. విద్యా సంస్కరణల లక్ష్యం నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా ప్రతి చిన్నారికీ విద్య అందుబాటులో ఉండేలా చూడడం కావాలి. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పం ప్రశంసనీయం. అయితే ఈ క్రమంలో ఏ ఒక్క చిన్నారి కూడా దూరం, రవాణా లేదా ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యకు దూరం కాకుండా చూడడం ప్రభుత్వ బాధ్యత. మెరుగైన భవనాలు నిర్మించడం కంటే ప్రతి చిన్నారికి మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడమే ఈ సంస్కరణ విజయానికి కొలమానం కావాలి.

# 'అనంత' సంపద అవసరమిప్పుడు!

ఇరాన్‌అమెరికా యుద్ధానంతర పరిస్థితుల్లో ముడి చమురు ధరలు పెరిగి, విదేశీ మారక ద్రవ్యంపై ఒత్తిడి పెరుగుతోందని కేంద్ర ప్రభుత్వం ప్రజలను బంగారం కొనుగోలు తగ్గించాలని కోరుతోంది. అయితే మరోవైపు కేరళలోని శ్రీ పద్మనాభస్వామి ఆలయ భూగర్భ గదుల్లో అపారమైన బంగారం, వజ్రాలు, ఆభరణాలు నిక్షిప్తమై ఉన్నాయని దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. ఆలయంలోని అనేక గదులు తెరచి వాటిలో ఉన్న నిధులను గుర్తించినప్పటికీ, 'వాల్ట్‌బి' మాత్రం ఇప్పటికీ మూసే ఉంది. దానిని తెరిస్తే దేవుని శాపం వస్తుందని, దానికి నాగబంధనం ఉందని, సర్పాలు కాపలా కాస్తున్నాయని, విపత్తులు సంభవిస్తాయని కొందరు ప్రచారం చేస్తున్నారు. ఈ వాదనల నేపథ్యంలో శాస్త్రీయ దృక్పథం, రాజ్యాంగ విలువలు, ప్రజా ప్రయోజనం వంటి అంశాలు ముందుకు వస్తున్నాయి. భారత రాజ్యాంగంలోని అధికరణ 51ఎ(హెచ్) ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం, విచారణాత్మక మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచిస్తుంది. ఈ స్థితిలో శాపాలు, జ్యోతిష్య హెచ్చరికలు, నాగబంధనాల వంటి విశ్వాసాల ఆధారంగా జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం సరైనదా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. భక్తుల విశ్వాసాలను గౌరవించడం అవసరమే. కానీ విశ్వాసం పేరుతో సంపదను శాశ్వతంగా పరిశీలనకు దూరంగా ఉంచడం, దాని లెక్కలు ప్రజలకు తెలియకుండా చేయడం, దాని భద్రతపై సందేహాలకు అవకాశం ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. గతంలో కొన్ని ఆస్తులు అదృశ్యమయ్యాయనే ఆరోపణలు, సొరంగ మార్గాలపై వచ్చిన ప్రచారాలు కూడా పారదర్శకత అవసరాన్ని మరింత బలపరుస్తున్నాయి. 'వాల్ట్‌బి'ని తెరవాలా వద్దా అనే ప్రశ్నను మూఢనమ్మకాల కోణంలో కాకుండా, శాస్త్రీయ, పురావస్తు, భద్రతా ప్రమాణాల ఆధారంగా పరిశీలించాలి. నిర్మాణ భద్రత, వారసత్వ సంరక్షణ, భక్తుల భావోద్వేగాలు, చట్టపరమైన అంశాలు వంటివాటినీ పరిగణనలోకి తీసుకుని నిపుణుల కమిటీ పర్యవేక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిశోధనలు జరపవచ్చు. రాజులు, మహారాజులు కూడబెట్టిన సంపదలు ప్రజా పర్యవేక్షణకు అతీతంగా, కేవలం పురాణ భయాల ఆధారంగా శాశ్వతంగా మూసివేయాలా? లేక పారదర్శక లెక్కలతో, వారసత్వ సంపదగా సంరక్షించాలా? అనే అంశంపై దేశవ్యాప్తంగా హేతుబద్ధమైన చర్చ అవసరం. భక్తి వ్యక్తిగత విశ్వాసం కావచ్చు. కానీ, ప్రజా ఆస్తుల నిర్వహణ, భద్రత, లెక్కలు, పారదర్శకత వంటి విషయాలు రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం, ప్రజా ప్రయోజనాల ఆధారంగానే నిర్ణయించాలి. అప్పుడు మాత్రమే విశ్వాసానికి, రాజ్యాంగానికి గౌరవం దక్కి... రెండూ సమానంగా నిలబడతాయి.



EDITED, PUBLISHED AND OWNED BY N.MAHESHWAR REDDY PUBLISHED AT D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYD - 500054, TELANGANA. PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYDERABAD -500 054. RNI TELTEL 2024/90138, CONTACT NO: 8985586689, EMAIL: suryavelugutelanganadesk@gmail.com, Web SITE: www.suryavelugu.com